**Ramazan-ul-Mubarak**
**(Telugu)**

# రమజాన్
# సత్కార్యాల సమాహారం

మూలం

**మౌలానా సయ్యద్ అబుల్ ఆలా మౌదూది**

అనువాదం

**యం.డి. ఉస్మాన్‌ఖాన్**

**తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్**
సందేశభవనం, లక్కడ్‌కోట్,
హైదరాబాద్-500 002.



**Ramazan Satkaryala Samaharam**
**Ramazan-ul-Mubarak (Telugu)**

**TIP Series No. : 149**

Written by : Maulana Syed Abul A'la Maududi

Translated by : Muhammed Osman Khan

All Rights Reserved with Publishers

First Edition : November 2006

Copies : 2000

**Price : Rs. 20**

ISBN : 81-88241-43-1

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 24564583
Fax : +91 +40 – 24576237
e-mail: tiphyderabad@rediffmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.

*అనంతకరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

# రమజాన్ సత్కార్యాల సమాహారం

1) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు:

"రమజాన్ మాసం రాగానే స్వర్గ ద్వారాలు తెరవబడతాయి, నరక ద్వారాలు మూసివేయబడతాయి, (మరో ఉల్లేఖనంలో స్వర్గ ద్వారాలకు బదులు ఆకాశద్వారాలు, కారుణ్యద్వారాలు అని ఉంది) షైతానులు బంధించ బడతారు." (ముత్తఫకున్ అలైహ్)

రమజాన్ మాసం ప్రారంభంలో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) తన ప్రసంగాల ద్వారా ప్రజలకు హితబోధ చేసేవారు. వారిని జాగృతపరిచేవారు. అలాంటి ఓ ప్రసంగాన్నే ఇక్కడ పొందుపరుస్తున్నాము.

దైవప్రవక్త (సఅసం) చేసిన ఈ హితోపదేశాన్ని సరిగ్గా అర్థం చేసుకోవా లంటే, పాఠకులు ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. దైవప్రవక్త (సఅసం) ఎవరినుద్దేశించి హితబోధ చేశారో వారు నూటికి నూరుశాతం పరిపూర్ణ ముస్లిములు. అలాంటి పరిపూర్ణ విశ్వాసుల్ని మానవ చరిత్ర ఈనాటి వరకూ దర్శించలేదు. సాధారణంగా దైవప్రవక్త (సఅసం) జుమా ప్రసంగాల ద్వారానే ప్రజలకు హితోప దేశం చేసేవారు.

జుమా నమాజు కోసం 'మస్జిదె నబవి' (ప్రవక్త మసీదు)కి వచ్చే ముస్లింలు అణుమాత్రమైనా మచ్చలేని దృఢవిశ్వాసులు; సృష్టికర్తకు తప్ప మరెవరికీ తలవంచని గొప్ప దైవభీతి పరాయణులు. అలాంటి విశ్వాసుల్ని సంబోధిస్తూ దైవప్రవక్త (సఅసం) హితోపదేశం చేశారు.



"......రమజాన్ మాసం రాగానే స్వర్గ ద్వారాలు (ఆకాశ, లేక కారుణ్య ద్వారాలు) తెరవబడతాయి...." అని చెప్పి ఆయన సంబోధితులకు చెప్పదలచుకున్నదేమిటంటే, రమజాన్ నెలలో ఎన్ని సత్కార్యాలు చేయగలరో శక్తి వంచనలేకుండా చేసుకోండి. స్వర్గ ద్వారాలన్నీ మీకోసం తెరుచుకొనే ఉన్నాయి. ఒకవేళ దాన ధర్మాల ద్వారం గుండా స్వర్గంలోకి వెళ్ళదలుచుకొంటే దాన ధర్మాల ద్వారం గుండానే వెళ్ళండి. రోజా (ఉపవాసం) ద్వారం గుండా పోదలిస్తే రోజా ద్వారం గుండా వెళ్ళండి. ఖుర్ఆన్ పారాయణం ద్వారా ప్రవేశించదలిస్తే ఆ మార్గానే వెళ్ళి స్వర్గంలో ప్రవేశించండి. పాపాలకు దూరంగా ఉండి స్వర్గంలోకి వెళ్ళదలిస్తే ఆవిధంగానే వెళ్ళండి. మొత్తంమీద స్వర్గంలోకి ప్రవేశించడానికి అవసరమయ్యే అన్ని మార్గాలూ మీకోసం తెరుచుకొని ఉన్నాయి. ఇప్పుడిక "మిమ్మల్ని మీరు స్వర్గ ప్రవేశానికి అర్హులుగా మలచుకునే పని మీ చేతుల్లోనే ఉంది."

స్వర్గ ద్వారాలు తెరవబడతాయి అని చెప్పిన తర్వాత– 'నరక ద్వారాలు మూసివేయబడతాయి.' అని చెప్పడం జరిగింది.

అంటే, ఇతర మాసాల్లో సాధారణంగా జరగడానికి అవకాశమున్న దుష్కార్యాలన్నీ రమజాన్ మాసంలో తగ్గుముఖం పడతాయన్నమాట. ఒక ముస్లిం రమజాన్‌పై విశ్వాసం, ఆ మాసంలో చుట్టుపక్కల ఉన్న వాతావరణ ప్రభావం వల్ల దుష్కార్యాలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. ఈ విధంగా నరక ద్వారాలు మూసుకుపోతాయి.

తరువాత– 'షైతానులు బంధించబడతారు' అని చెప్పడం జరిగింది. అంటే, శుభప్రదమైన ఈ రమజాను మాసంలో సత్కార్యాలు అమితంగా పెరిగిపోతాయి. షైతాను చేష్టలైన దుర్మార్గాలు ఆగిపోతాయి. ఎలాగంటే ముస్లిములందరూ ఒకేసారి ఉపవాసవ్రతం పాటిస్తారు. ఒక్కొక్కరు ఒక్కో విధంగా రోజా పాటించరు. ముస్లిములందరూ ఒకేసారి రోజా పాటిస్తూ దైవం

వైపుకు మరలుతారు కాబట్టి సమాజ వాతావరణమంతా ఒక్కసారిగా మారి పోతుంది. ఇలా ఇతర దినాల్లో కనిపించదు. అందుకని మనుషుల హృదయాలు మాటిమాటికీ దైవం వైపుకు మరలుతూ ఉంటాయి. ఒక మనిషి ప్రతిరోజూ పన్నెండు నుంచి పద్నాలుగు గంటల పాటు ఉపవాస దీక్షలో ఉంటాడు. అతడు తాను ఉపవాసం ఉన్నానని, కేవలం దైవం కోసమే రోజా పాటిస్తున్నాననే విషయం అనుక్షణం అతడికి గుర్తుకు వస్తూఉంటుంది. దైవ సంతోషం కోసమే రోజా పాటిస్తున్నాననే విషయాన్ని అతడు విస్మరించడు. అందుకని అతడికి దాహం వేసినా నీళ్ళుత్రాగడు. ఆకలి వేసినా, తినాలని కోరిక కలిగినా ఆ కోరికను అణిచేసి తినకుండానే ఉంటాడు. ఎందుకంటే తాను కేవలం దైవ ప్రసన్నత కోసమే రోజా వ్రతం పాటిస్తున్నాడని అతడికి బాగా తెలుసు. ఈ విధంగా రమజాన్ మాసం ఆసాంతం మనిషి దైవంతో అత్యంత సన్నిహితంగా ఉంటాడు. దైవం వైపుకే మరలి ఉంటాడు.

రోజా విరమణ సమయంలో – ఇప్పటి వరకూ దైవం తనను ఏమీ తినకుండా, తాగకుండా బంధించి ఉంచాడు. ఇప్పుడు ఆ బంధనాలు విప్పేసి తినడానికి త్రాగడానికి అనుమతినిచ్చాడని అతడు భావిస్తాడు.

ఇఫ్తార్ (రోజావిరమణ) తరువాత భోంచేసి కాస్త మేను వాల్చాడో లేదో మళ్ళీలేచి తరావీహ్ నమాజుకు వెళ్ళిపోతాడు. దీంతో మళ్ళీ దైవంతో సంబంధం మొదలవుతుంది. ఈ విధంగా ఇరవై నాలుగ్గంటలూ దైవంతో అతడి సాన్నిహిత్యం నిత్యనూతనంగా ఉంటుంది.

ఈ సంబంధం, ఈ సాన్నిహిత్యం ఒక వ్యక్తికే పరిమితం కాదు. యావత్తు ముస్లిం సముదాయం ఏకకాలంలో ఈ అనుబంధానుభూతితో పులకించి, పునీతమవుతుంది. ఈ విధంగా రమజాన్ మాసం సత్కార్యాల వసంతంగా రూపొందింది.

వర్షా కాలంలో నేల పులకించి ప్రతి వస్తువూ పచ్చగా కళకళలాడినట్లు, రమజాన్ మాసంలో సత్కార్యాలు అత్యధికంగా గుబాళించడానికి అసంఖ్యాక



అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. అంటే రమజాన్ సత్కార్యాల సీజన్ అన్నమాట. ఈ సీజన్‌లో ఎవరు ఎంతయినా సంపాదించుకోవచ్చు. ఆధ్యాత్మికంగా, మానసికంగా ఎంత అభివృద్ధి సాధించాలన్నా సాధించవచ్చు. ఈ మాసంలో ఒకరి సత్కార్యం మరొకరి సహాయకారిగా రూపొందుతుంది. ప్రతి మనిషి మరొక మనిషి రోజాలో సహాయకారిగా నిలుస్తాడు. రమజాన్‌లో కాకుండా వేరే దినాల్లో రోజా పాటించినట్లయితే ఆ రోజా చాలా భారంగా అనిపిస్తుంది. ఎందుకంటే వేరెవరూ అతనికి సహాయకారిగా ఉండరు. కాని రమజాన్ ప్రత్యేకత ఏమిటంటే, ఈ మాసంలో మొత్తం సమాజం ఒకే 'స్థితి'లో ఉంటుంది. ఈ కారణంగా ఒక మనిషికి లక్షలాది మంది సహాయం అందు తుంది. వారి దైవభీతికి, సత్కార్యాభిలాషకు ఎంతో శక్తి లభిస్తుంది.

రమజాన్ మాసంలో మానవుల ఆధ్యాత్మిక ప్రగతికి, నైతిక విలువల నిర్మాణానికి అసంఖ్యాక మార్గాలు తెరుచుకుంటాయి. బహుశా మీరు చూస్తూనే ఉంటారు. ఈనాటి చెడిపోయిన కాలంలో కూడా ఎవరైనా రమజాన్ మాసంలో దుర్భాషలకు దిగితే, 'అయ్యయ్యో! రమజాన్ మాసంలో కూడా ఏమిటా పాడు మాటలు' అనడాన్ని మనం గమనిస్తాం.

అంటే, రమజాన్ మాసపు ఔన్నత్యం, ప్రాముఖ్యతలను గురించిన స్పృహ ఈనాటి సమాజానికే ఇంత మెండుగా ఉందంటే ఇస్లాం ప్రారంభదశలో ఏ స్థాయిలో ఉందో మనం ఊహించవచ్చు.

ఈ కారణంగానే 'రమజాన్ మాసంలో స్వర్గ ద్వారాలు తెరవబడతా యని, నరక ద్వారాలు మూసివేయబడతాయని, షైతానులు బంధించబడతా రని' పేర్కొనడం జరిగింది. ఇక్కడ మనం ఒక విషయాన్ని దృష్టిలో ఉంచు కోవాలి. ఈ హితోపదేశం ఒక చక్కని ముస్లిం సమాజం, చక్కని వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని చేయబడింది. అలా కాకుండా ఒకవేళ ఎవరైనా షిర్క్ (బహుదైవారాధన)తో పాటు అనేక ఇతర పాపాల్లో కూరుకుపోయి ఉన్నట్లయితే

అలాంటి వారికోసం నరక ద్వారాలు తెరిచి ఉంటాయి, స్వర్గద్వారాలు మూసుకుపోతాయని గ్రహించాలి.

## స్వర్గంలోని ఒక ద్వారం - ఉపవాసులకు ప్రత్యేకం

2) హజ్రత్ సహెల్ బిన్ సాద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు:

'స్వర్గానికి ఎనిమిది ద్వారాలున్నాయి. వీటిలో ఒక ద్వారం పేరు 'రయ్యాన్'. ఈ ద్వారం గుండా స్వర్గంలోకి కేవలం ఉపవాసులు మాత్రమే ప్రవేశించగలుగుతారు.' (ముత్తఫకున్ అలైహ్)

స్వర్గ ద్వారాలంటే, మనిషి ఏ గొప్పగొప్ప సత్కార్యాల ద్వారానైతే స్వర్గంలోకి ప్రవేశించగలడో అలాంటి మహా సత్కార్యాలని అర్థం. ఉదాహరణకు ఒక వ్యక్తి దానగుణం, ధర్మగుణం కలిగి దైవమార్గంలో తన సంపదను వెచ్చిస్తాడు. అతడు ఇతర సత్కార్యాలూ చేస్తాడు. నమాజులు పాటిస్తాడు. రోజాలు పాటిస్తాడు. వీటన్నిటికీ దీటుగా అతడు దైవమార్గలో ధనాన్ని ఖర్చుపెడతాడు. దైవ మార్గంలో తన సంపదను వెచ్చించడం అతడిలోని ప్రత్యేక త్యాగగుణం. ఇదే అతడికి స్వర్గద్వారం. ఈ ద్వారం గుండా అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. అదే విధంగా మరోవ్యక్తిలో జిహాద్ ఫీ సబీలిల్లాహ్ గుణం ప్రత్యేకంగా ఉంటుంది. ఇలాంటి వ్యక్తి ముజాహిదీన్ ఫీసబీలిల్లాహ్ ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. ఈ విధంగా ఒక్కొక్కరి ఆచరణల్లో ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. దాని ప్రకారంగా వారు స్వర్గప్రవేశం చేస్తారు.

మరో విధంగా చెప్పాలంటే, ప్రపంచంలో అసంఖ్యాక సత్కార్యాలు ఉన్నాయి. కాని వాటిని విభజిస్తే ఆ సత్కార్యాలు ఎనిమిది భాగాలుగా విభజితమవుతాయి. ఈ ఎనిమిది మార్గాల్లో ఎవరు ఎక్కువగా దేనికి ప్రాధాన్యతనిస్తారో వారు ఆ మార్గం గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు.



ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించబడిన 'రయ్యాన్' ద్వారం గుండా ఉపవాసులు మాత్రమే స్వర్గప్రవేశం చేస్తారు. అంటే, ఉపవాసాలైతే సాధారణంగా ముస్లిములందరూ పాటిస్తారు. కాని అత్యధికంగా రోజాలు పాటించే, రోజా హక్కును పూర్తిగా నెరవేర్చే, కేవలం దైవప్రసన్నత కోసం శక్తివంచన లేకుండా కృషి చేసే వారి కోసమే ఈ 'రయ్యాన్' ప్రత్యేకం అన్నమాట.

## గత పాపాలన్నీ క్షమించబడే కాలం

3) హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు:

"పరిపూర్ణ విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ ఉపవాసాలు పాటించేవారి పూర్వ పాపాలన్నీ క్షమించబడతాయి. ఎవరైతే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో రమజాన్ రాత్రుల్లో ఆరాధనలు చేస్తారో వారి గత అపరాధాలన్నీ మన్నించబడతాయి. మరెవరైతే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో 'లైలతుల్ ఖద్ర్'లో దైవారాధనలో నిమగ్నమై గడుపుతారో వారి గత పాపాలు కూడా మన్నించివేయబడతాయి." (ముత్తఫకున్ అలైహ్)

ఈ హదీసు మూలంలో 'ఇహ్తెసాబ్' అనే పదం వాడబడింది. 'ఇహ్తెసాబ్' అంటే మనిషి తన సకల సత్కార్యాలను దైవం మాత్రమే పుణ్యఫలం ప్రసాదిస్తాడని భావించి, దైవప్రసన్నత కోసం మాత్రమే చేయడం.

ఈ హదీసులో మీ గత పాపాలన్నీ మన్నించబడతాయనే శుభవార్త ఇవ్వడం జరిగింది. అంటే మీరు మీ ఇష్టం వచ్చినట్లు దైవాదేశాలను ధిక్కరిస్తూ, పరలోకంలో జవాబు చెప్పుకోవాల్సి ఉందన్న యదార్థాన్ని తిరస్కరిస్తూ, రమజాన్ రోజాలు పాటించండి, తరావీ నమాజులు ఆచరించండి, లైలతుల్ ఖద్ర్‌లో జాగరణలు చెయ్యండి చాలు, మీ గత పాపాలన్నీ క్షమించ బడతాయి.

మిగతా పదకొండు నెలల మీరు ఏమేమి చేసుకున్నా పర్వాలేదు. లంచాలు మెక్కండి, ప్రజల హక్కుల్ని కొల్లగొట్టండి. చాడీలు చెప్పండి, అబద్ధాలాడండి, హత్యలు, మానభంగాలు ఏవైనా చెయ్యండి. మళ్ళీ రమజాన్ రాగానే నమాజులు రోజాలు, తరావీహ్‌లు, జాగరణలు చేస్తే సరిపోతుందని దీనర్థం ఎంతమాత్రం కాదు.

ఈ హదీసులను అధ్యయనం చేసేటప్పుడు దీని సంభోదితులు ఎవరు? అనే విషయాన్ని మనం ఎప్పుడూ విస్మరించకూడదు. ముందే చెప్పుకున్నట్లు అనుక్షణం దైవ ప్రసన్నత కోసం పరితపిస్తూ దైవాదేశాల కనుగుణంగా తమ జీవితాలను మలచుకోడానికి ప్రయత్నించే ఆనాటి సజ్జనులు, సద్గుణ సంపన్నులు దీని సంభోదితులు.

ఒకవేళ పొరపాటున వారివల్ల ఏదైనా తప్పిదం దొర్లిపోతే దాన్ని సమర్థించుకోవడంగాని, లేక ఆ తప్పును కప్పిపుచ్చుకోడానికి మరో తప్పు చేయడం గాని వారి నైజంలోనే ఉండేది కాదు. ఆ సద్గుణ సంపన్నుల వల్ల కూడా ఏదైనా మానవ సహజ బలహీనత కారణాన ఏదైనా పొరపాటు జరిగితే అనుక్షణం పశ్చాత్తాపపడేవారు. దైవం ముందు సాగిలపడి తౌబా చేసేవారు.

మానవ సహజ బలహీనత వల్ల ఒక మనిషి వల్ల ఏదైనా పొరపాటు జరిగితే, వెంటనే అతడు మేల్కొని తన తప్పును తెలుసుకొని సత్కార్యాల వైపు మొగ్గి దైవభీతితో కంపించిపోతే అది వాస్తవానికి 'తౌబా' అనిపించుకుంటుంది.

తౌబా రెండు రకాలు – ఒక రకం ఏమిటంటే, ఒక వ్యక్తి వల్ల ఏదైనా పొరపాటు జరిగిందనుకోండి, వెంటనే అతడు పశ్చాత్తాపపడతాడు. పాప క్షమాపణకు ఇదొక మార్గం.

రెండోరకం ఏమిటంటే, ఒక వ్యక్తి వల్ల ఒక తప్పిదం జరిగిపోయింది. కాని వేరే సత్కార్యాల్లో పడి అతడు తౌబా చేయడం మరచిపోయాడు. తరువాత



అతడు చేసిన నమాజు వల్ల అంతకుముందు చేసిన పాపం మన్నించబడు తుంది. అలాగే అతడు ఉపవాసం పాటించినా అదీ అతడి గత పాప క్షమాపణకు ఉపకరిస్తుంది.

వాస్తవానికి ఒక వ్యక్తి వల్ల ఒకసారి ఏదైనా పాపం జరిగిపోతే వెంటనే అతడు దైవం వైపునకు మరలడాన్నే తౌబా అంటారు.

ఒక సేవకుడు తన యజమాని ఆజ్ఞకు వ్యతిరేకంగా ఏదైనా తప్పుచేసి, వెంటనే తన యజమానితో క్షమాపణ వేడుకొని మునుపటిలా బుద్ధిగా సేవలందిస్తుంటే, తెలిసీతెలియక చేసిన ఒక్క తప్పుకే అతడి యజమాని అతన్ని శాశ్వతంగా పనిలోంచి తొలగించడు. ఎప్పుడైతే అతడు తన తప్పు తెలుసుకొని తిరిగొచ్చి క్షమాపణలు వేడుకొని మునుపటిలా సేవలందించడం ప్రారంభిం చాడో అప్పుడు అతని పూర్వ ప్రవర్తనను దృష్టిలో ఉంచుకొని ఈ ఒక్క తప్పును మన్నించివేస్తాడు. మళ్ళీ ఎప్పటిలాగానే అభిమానిస్తాడు.

ఖచ్చితంగా దైవం కూడా తనదాసుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తాడు. దాసుడు మౌలికంగా దైవవిధేయుడై ఉండి, కావాలని దైవం పట్ల కృతఘ్నుతతో, తలబిరుసుతనంతో ప్రవర్తించడో, అటువంటి మనిషి వల్ల ఎప్పుడైనా ఏదైనా పొరపాటు జరిగితే వెంటనే అతడు దైవసన్నిధిలో తన తప్పును ఒప్పుకుంటే, దైవం తన కారుణ్యానికి అతణ్ని దూరం చేయడు. అంటే అతని ప్రవర్తన వల్ల తెలిసిందేమిటంటే, అతడు ఎదురు దెబ్బయితే తిన్నాడుకాని దైవం నుండి పారిపోలేదు. దైవద్రోహానికీ ఒడిగట్టలేదు.

ఈ కారణంగానే 'ఎవరైతే విశ్వాసంతో, పుణ్యఫలాపేక్షతో ఉపవాసాలు పాటిస్తారో వారిగత పాపాలు మన్నించబడతాయని ' పేర్కొనడం జరిగింది. రమజాన్ రాత్రుల్లో తరావీ నమాజులు చేసినా అవి అతనికి పాపపరిహారంగా పరిణమిస్తాయి. లైలతుల్ ఖద్ర్‌లో దైవారాధనలో గడిపినా కూడా గత పాపాల నుండి విముక్తికి మార్గం సుగమం అవుతుంది.

## ఉపవాసాల పుణ్యఫలం - హద్దుల్లేని ప్రతిఫలం

4) మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారని, హజ్రత్ అబూహురైరా (రజి) ప్రవచించారు:

"ఆదం సంతానం యొక్క ప్రతి ఆచరణకు అనేక రెట్లు పుణ్యం లభిస్తుంది. ఒక్కో సత్కార్యానికి పది రెట్ల నుండి ఏడు వందల రెట్ల వరకు పెంచడం జరుగుతుంది. కాని దేవుడు "రోజా వాటికి భిన్నమైనది. అది కేవలం నా కోసమే. కాబట్టి దాని ప్రతిఫలం స్వయంగా నేనే ఇస్తాను" అంటున్నాడు. ఉపవాసం ఉన్నవాడు తన మనోవాంఛలను, తన అన్నపానీయాలను నా కోసమే వదిలివేస్తాడు. ఉపవాసికి రెండు సందర్భాల్లో అమితమైన ఆనందం కలుగుతుంది. ఒకటి రోజా విరమణ సమయంలో– రెండోది తన ప్రభువును కలుసుకున్న సమయంలో. ఉపవాసి నోటినుండి వెలువడే వాసన దైవం దృష్టిలో కస్తూరి సువాసన కన్నా ప్రియమైనది. రోజా ఢాలు (కవచం) వంటిది. ఎవరైనా ఉపవాసం పాటిస్తున్నట్లయితే వారు నోటితో అశ్లీల పలుకులు పలకకూడదు. కయ్యాలకు కాలుదువ్వకూడదు. ఒకవేళ ఎవరైనా అతణ్ణి తిట్టినా, అతడితో జగడానికి దిగినా, 'బాబూ నేను ఉపవాసం పాటిస్తున్నాను' అని చెప్పాలి." (ముత్తఫకున్ అలైహ్)

ఇక్కడ ఇతర సత్కార్యాలు పదినుండి ఏడొందల రెట్లు పెంచబడ తాయని చెప్పడం జరిగింది. కాని రోజా విషయంలో అది కేవలం తన కోసమే కనుక దాని ప్రతిఫలం స్వయంగా తానే తన దాసునికిస్తాను అంటున్నాడు దేవుడు.

అంటే ఒక్కరోజా తప్ప మిగతా సత్కార్యాలన్నీ దైవం కోసం కాదు. కాబట్టి దాని పుణ్యఫలం కూడా దైవం ఇవ్వడని దీని అర్థం కాదు.

అసలు అర్థం ఏమిటంటే, దైవవాక్కు ప్రకారం – రోజా కేవలం దైవానికి మాత్రమే ప్రత్యేకం. దానికి బహుమానంగా దేవుడు తాను కోరినంత



ప్రసాదిస్తాడు. ఇతర సత్కార్యాల విషయంలో పది నుండి ఏడొందల రెట్లు అని ఒక పరిమితి ఉంది. కాని రోజా విషయంలో అలా లేదు. రోజా ప్రతిఫలం దాసునికి స్వయంగా తానే ఇస్తానంటున్నాడు. అంటే రోజాకు ఒక పరిధి అనేది లేదు. అల్లాహుతఆలా ఎంత ఇవ్వదలచుకుంటే అంత ఇస్తాడు.

## ఉపవాసాలకే ఈ అసాధారణ ప్రాముఖ్యం ఎందుకు?

అసలు విషయం ఏమిటంటే, ఒక్క రోజా తప్ప మిగతా ఆరాధనలు, సత్కార్యాలన్నీ మనిషి ద్వారా పైకి వ్యక్తం అవుతుంటాయి. ఉదా॥ ఒక మనిషి నమాజు చేయాలంటే నమాజులో నిర్చోవడం, కుర్చోవడం, రుకూ, సజ్దాలు చేయడం ఉంటాయి. ఇవన్నీ బయటికి వ్యక్తమయ్యే ఆచరణలే.

అదేవిధంగా జకాత్, హజ్‌లు కూడా! జకాత్ ఇచ్చే వాళ్ళొకరుంటే తీసుకొనే వాళ్ళు మరొకరు. హజ్‌యాత్ర ఒక సుదూర ప్రయాణం. చుట్టు పక్కలవాళ్ళకు, బంధుమిత్రులకు అందరికీ తెలిసే ఆరాధనే. కాని వీటికి భిన్నంగా రోజా ఏ విధంగానూ పైకి వ్యక్తమయ్యే ఆరాధన కాదు. ఇదొక గుప్త ఆరాధన. దాసునికి దైవానికి మాత్రమే దీని రహస్యం తెలుస్తుంది.

దీని మరో కోణం ఏమిటంటే, రోజా దైవాదేశ పాలనలో ఓ వ్యతిరేక కోణం. ఉదా॥ తినకపోవడం, తాగకపోవడం. ఇదేవిధంగా ఏఏ కార్యాలనుండి వారించడం జరిగిందో వాటికి దూరంగా ఉండడం.

ఈ వ్యతిరేక ఆచరణ తనకూ, తన ప్రభువుకు తప్ప మరెవరికీ తెలిసే అవకాశం లేదు. అంటే ఒక మనిషి రోజా పాటిస్తూ దొంగచాటుగా తిన్నా, త్రాగినా ఆ సంగతి ఎవరికీ తెలియదు. అలాగే ఒక వ్యక్తి రోజా పాటించకుండా నేను రోజా పాటిస్తున్నానని చెప్పవచ్చు. విన్నవాడు అనుమానించడానికీ ఆధారాల్లేవు. రోజా ఉన్నాడా లేడా అని ఇదమిద్ధంగా ఎవరూ చెప్పలేరు. ఆ విషయం కేవలం అతడికి దైవానికి మాత్రమే తెలుసు. రోజా దైవానికి దాసునికి

మాత్రమే తెలిసే విషయం. ఈ కారణంగానే రోజాలో ప్రదర్శనా భావనకు అంతగా తావుండదు.

ఒక వ్యక్తి లోకుల దృష్టిలో పడేందుకు తాను రోజా పాటిస్తున్నానని చెప్పుకుంటూ తిరుగుతాడు. కాని రోజా వాస్తవికత దృష్ట్యా ప్రదర్శనా బుద్ధికి తావేలేదు. ఎందుకంటే అతడు జనాన్ని మోసగించగలడేమోగాని, దైవాన్ని మోసగించలేడు. అందుకే 'రోజా కేవలం నా కోసమే 'వఅనాఅజ్‌జీబిహి' దాని ప్రతిఫలం కూడా నేనే ఇస్తాను' అని చెప్పడం జరిగింది. అంటే, అల్లాహ్ ఉపవాసానికి అపరిమితమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడన్న మాట.

దైవం దృష్టిలో ఉపవాసాలకు ఇంతటి ప్రాముఖ్యత సిద్ధించడానికి ఓ ముఖ్య కారణం ఉంది. ఉపవాసి తన మనోవాంఛలను, అన్నపానీయాలను దైవం కోసమే వదిలేస్తాడు. అందుకని దైవం కూడా పరలోకంలో అతడికి అపరిమితమైన బహుమానాలతో సత్కరిస్తాడు.

## ఉపవాసిని ఆనందభరితుని చేసే రెండు సందర్భాలు

☞ 'ఉపవాసికి రెండు సదర్భాల్లో అమితానందం కలుగుతుంది' అని చెప్పబడింది.

ఒకటి, ఉపవాస విరమణ సమయంలో.

రెండు, తన ప్రభువును కలుసుకున్నప్పుడు.

అంటే, ఏ ఆనందమైతే ఇఫ్తార్ సమయంలో కలుగుతుందో అది అక్కడి వరకే పరిమితం కాదు. ఈ ప్రపంచంలో ఆచరించిన సత్కార్యాలకు పరలోకంలో లభించిన బహుమానాలు, దైవాన్ని ప్రత్యక్షంగా కలుసుకోవడం లోని ఆనందానుభూతి, దైవసాన్నిహిత్యం ఇవన్నీ అతన్ని ఆనందడోలికల్లో ముంచెత్తుతాయి. శాశ్వతానందం అతడి సొంతమవుతుంది.



☞ 'ఉపవాసి నోటినుండి వెలువడే ఒకరకమైన వాసన దైవానికి కస్తూరి సువాసన కన్నా ప్రియమైనది' అని చెప్పడం జరిగింది.

ఒక మనిషి ఎంత పరిశుభ్రతను పాటిస్తున్నా, ఎన్నిసార్లు నోటిని పేస్టులతో, పళ్ళపొడులతో శుభ్రపరుచుకొనే వాడైనప్పటికీ కొన్ని గంటల పాటు అన్నపానీయాలకు దూరంగా ఉన్న కారణంగా అతడి నోటిలో ఒక రకమైన దుర్వాసన వస్తుంది. అందుకని ఉపవాసి నోటినుండి వెలువడే అలాంటి దుర్వాసనను అసహ్యించుకోరాదని ఈ హదీసులో పేర్కొనడం జరిగింది. ఎందుకంటే ఆ వాసన దైవానికి కస్తూరి వాసన కన్నా ప్రియమైనది కనుక.

## ఉపవాసం - దుష్కార్యాలను ఎదిరించే రక్షణ కవచం

☞ "రోజా డాలు లాంటిది. కనుక ఎవరైనా రోజా పాటిస్తున్నట్లయితే నోటితో అశ్లీల పలుకులు పలకకూడదు. ఘర్షణలకు దిగకూడదు."

'రోజా డాలు లాంటిది' అంటే రోజా జీవన సమరంలో మనిషిని దుష్కార్యాల నుండి రక్షించే డాలు అని అర్థం. ఏ విధంగా శతృదాడిని డాలుతో ఎదుర్కొంటామో, అలాగే దుష్కార్యాలు ఎదురైనప్పుడు తాను రోజా పాటిస్తున్నానన్న స్పృహ ప్రదర్శిస్తే చాలు దుష్కార్యాలు ఆగిపోతాయి. ఆ విధంగా రోజా దుష్కార్యాలకు వ్యతిరేకంగా ఒక డాలులా పనిచేస్తుందన్న మాట.

ఈ డాలుకు సహకరించడం, దాన్ని పటిష్టపరచడానికి మనిషి స్వయంగా అశ్లీల మాటలు మాట్లాడకుండా ఉండాలి. ఎవరినీ చెడుగా అనకూడదు. జగడాలకు దిగకూడదు. ఇవి డాలుకు మొదటి సహకారం. మరో రకంగా డాలుకు సహకరించడమంటే, ఎవరైనా ఒక మనిషి తనంత తానుగా జగడానికి వస్తే, బాబూ! నేను రోజా పాటిస్తున్నాను అని చెప్పేయాలి. ఒకవేళ అతను తిట్టినా తాను మళ్ళీ తిట్టను అని చెప్పాలి. ఈవిధంగా రోజా అనబడే

ఈ దాలు పటిష్టమవుతుంది. ఫలితంగా ప్రతి చెడు నుండి సునాయాసంగా రక్షణ లభిస్తుంది.

## నరకం నుండి విముక్తి పొందే మాసం

5. హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు:

“రమజాన్ మొదటి రాత్రి వస్తూనే చెడులు వ్యాపింపజేయడంలో ఆరితేరిన షైతానులు, జిన్నాతులు బంధించబడతారు. నరక ద్వారాలు మూసివేయబడతాయి. వీటిలో ఏ ద్వారమూ తెరిచి ఉంచబడదు. స్వర్గ ద్వారాలన్నీ తెరిచి ఉంచబడతాయి. వీటిలోని ఏ ద్వారమూ మూసి వేయబడదు. పిలిచే వాడొకడు – ‘మంచిని కాంక్షించేవాడా ముందుకు రా! చెడులను కాంక్షించేవాడా ఆగిపో!’ అంటూ ఎలుగెత్తి పిలుస్తాడు. దైవం ఆరోజు అసంఖ్యాక మందిని నరకజ్వాలల నుండి విముక్తి కల్గిస్తాడు. ఇలాప్రతి రాత్రీ జరుగుతూ ఉంటుంది.” (తిర్మిజి, ఇబ్నెమాజ)

ఇస్లామీయ కాలమానానికి (పంచాంగానికి) చాంద్రమానమే కొలబద్ద. చాంద్రమాన మాసాలు తొలి చంద్రోదయంతోనే ప్రారంభమవుతాయి. ఈ రకంగా ప్రతి ఇస్లామియ నెల సూర్యాస్తమయంతో ఆరంభమవుతుంది. ఇలా రమజాన్ మాసం నెలవంక దర్శనంతో ప్రారంభమవుతుంది. అందుకే ‘రమజాన్ తొలిరాత్రి నుండి చెడులు వ్యాపింపజేసే జిన్నాతులు, షైతానులు బంధించ బడతారు’ అని పేర్కొనడం జరిగింది.

రమజాన్ ప్రత్యేకత మొత్తం ప్రపంచంలో కనిపించదు. విశ్వాసులు, సజ్జనులు ఉన్న దగ్గరే ఈ ప్రత్యేకత దర్శనమిస్తుందన్న విషయాన్ని ఈ సందర్భంలో గుర్తుంచుకోవాలి.



## షైతానులు ఎందుకు బంధించబడతారు?

విశ్వాసులు రమజాన్ ప్రారంభం కాగానే తమ మనోకాంక్షలపై నిర్బంధం విధించుకుంటారు. సాధారణంగా ఈ నిర్బంధం ఇతర దినాల్లో ఉండదు. రమజాన్ రాగానే షైతానులు బంధించబడిన పరిణామం ఇది.

ఉదాహరణకు ఇతర మాసాలలో నీళ్ళు త్రాగడం ఎప్పుడైనా ధర్మసమ్మతమే. కాని రమజాన్‌లో సుమారు పన్నెండు నుండి పద్నాలుగు గంటల పాటు నీళ్ళు నిషిద్ధమైపోతాయి. అలాగే భోజనం చేయడం, ధర్మసమ్మతమైన మార్గాల్లో తమ కోరికల్ని తీర్చుకోవడం ఇతర మాసాలలో ధర్మసమ్మతమే. కాని రమజాన్ దినాలలో మాత్రం అనేక గంటల పాటు ఇవన్నీ నిషిద్ధమైపోతాయి. దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే, రమజాన్ మాసంలో ఒక ముస్లిం మనసుపై, మనోవాంఛలపై, అతని దైనందిన జీవితంలోని స్వేచ్ఛాకార్యకలాపాలపై ఒక నిర్బంధం అమలవుతుంది. ఈ పరిస్థితి ఇతర దినాల్లో ఉండదు. ఎప్పుడైతే ఒక ముస్లిం ఈ నిర్బంధాన్ని స్వీకరిస్తాడో, తనకు తానుగా అందులో బందీ అయిపోతాడో అప్పుడే అతిడిలోని పైశాచికత్వం (షైతాను) కూడా బందీ అయిపోతుంది. ఒకవేళ ముస్లింలు కూడా కోరికలకు బానిసలై, ధర్మశాస్త్ర (షరీఅత్) నిబంధనలు అంగీకరించకపోతే వారిలోని షైతాన్ బంధించబడలేదని, స్వేచ్ఛగా వీరవిహారం చేస్తున్నాడని అర్థం. యధాతథంగా తనపని తాను చేసుకుపోతున్నాడని అర్థం చేసుకోవాలి. ఎవరైతే తన మనోవాంఛలపై షరీఅత్ నిబంధనలు అమలు పరుచుకున్నాడో, ఏ క్షణం అతడీ పని చేశాడో ఆ క్షణమే అతడిలోని షైతాన్ గొలుసుల్లో బంధించబడ్డాడని అర్థం చేసుకోవాలి. ఇదే విధంగా అతడు ఇటు ధర్మశాస్త్రాన్ని అనుసరించడం ప్రారంభించగానే అటు అతనికోసం స్వర్గ ద్వారాలన్నీ బార్లా తెరుచుకుంటాయి. నరక ద్వారాలన్నీ మూతపడతాయి.

షైతానులు బంధించబడతారంటే విశ్వాసులు, సజ్జనులు ఉండే చోట

మాత్రమే షైతానులు బంధించబడతారని అర్థం. యావత్ ప్రపంచంలోని షైతానులు బంధించబడతారనే అర్థాన్ని మనం ఇక్కడ వర్తింపజేయలేము.

ఈ రోజుల్లో ముస్లిం వీధుల్లో కూడా చాలా మంది షైతానులు యథేచ్ఛగా తిరుగుతున్నారు. ముస్లిములు అయిఉండి కూడా రమజాన్ ఆదేశాలను ఉల్లంఘిస్తుంటే, వారిలోని షైతాన్ స్వేచ్ఛగా తిరగడమేకాదు, వారి తలపైకెక్కి స్వారీ కూడా చేస్తాడు. కాబట్టి ముస్లింలు ఎంత తొందరగా మేల్కొంటే అంత మంచిది.

## రమజాన్ పిలుపు

☞ 'పిలిచేవాడొకడు ఎలుగెత్తి పిలుస్తున్నాడు. మంచిని కాంక్షించేవాడా ముందుకు రా! చెడును కాంక్షించేవాడా ఆగిపో' అని సెలవీయడం జరిగింది.

అంటే, ఎవడో ఒకడు చౌరస్తాలో నిలబడి చాటింపు వేస్తున్నాడని దీనర్థం కాదు. దైవశాసనాలను అనుసరించేవారికి రమజాన్ రాకడతో సత్కార్యాలు చేసుకొనే, దుష్కార్యాలనుండి రక్షింపబడే సీజన్ వచ్చేసిందని తెలిసిపోతుంది. రమజాన్ నెలవంక దర్శనమిచ్చిందనే ప్రకటన వెలువడడం తోనే మేలును కాంక్షించే మనిషి వీలైనన్ని సత్కార్యాలు దోచుకోడానికి తహతహలాడుతాడు, సత్కార్యాల జడివానలో తడిసి ముద్దవ్వాలని, శుభాల నిధులతో తన జోలె నింపుకోవాలని ఆరాటపడతాడు. అందుకే మంచిని కాంక్షించేవాడా! ముందుకు రా! నువ్వాశించే సమయం వచ్చేసింది అని చెప్పబడింది.

చెడులను కాంక్షించే వాడా! ఆగిపో. నువ్వాగిపోయే సమయం వచ్చే సింది. ఎందుకంటే ఈ మాసంలో నువ్వు ఎంత చిన్నతప్పు చేసినా అది అనేక రెట్లు పెరిగిపోతుంది. దీనికి భిన్నంగా నువ్వెంత చిన్న సత్కార్యం చేసినా అదికూడా విపరీతంగా పెరిగిపోయి అనంతంగా విస్తరిస్తుంది. అందుకని ఇక



నువ్వు దుష్కార్యాలను మానుకోవడమే నీకు అన్ని విధాలా శ్రేయస్కరం.

## అగ్ని కీలల నుండి రక్షింపబడేవారు....

☞ 'రమజాన్ మాసంలో అనేకమంది దైవదాసులు నరకాగ్ని నుండి విముక్తి పొందుతారు' అని ప్రవచించడం జరిగింది.

మూలంలో 'అతీఖ్' అనే పదం వాడబడింది. 'అతీఖ్' అంటే స్వేచ్ఛా పరుడని అర్థం. అంటే అనేక మంది దాసులు తమ సత్కార్యాల మూలంగా నరకాగ్ని కీలలనుండి స్వేచ్ఛ పొందుతారన్న మాట. అందుకని ప్రతి మనిషి ఈ నరకాన్ని కీలల నుండి విముక్తి పొందేలా తననుతాను మలచుకోవాలి.

'ప్రతి రాత్రి ఇలాగే జరుగుతూ ఉంటుంది.'

అంటే, పవిత్ర రమజాన్ మాసపు శుభాలు, కారుణ్యాలు, దాని ప్రత్యేకతలు రమజాన్ మొదటి రాత్రినుండే ప్రారంభమవుతాయి. ఈ విధంగా ఈ శుభాలు రమజాన్ మాసంలోని ప్రతి రాత్రి యధాతథంగా ప్రసరిస్తూనే ఉంటాయి.

## కారుణ్యం, క్షమాపణ, విముక్తుల మాసం

9. హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) షాబాన్ మాసం చివరి తేదీన ప్రసంగిస్తూ ఇలా సెలవిచ్చారు, "ప్రజలారా! ఒక మహోన్నతమైన మాసం తన కారుణ్యాను గ్రహాలను మీపై కురిపించబోతోంది. ఇది చాలా శుభప్రదమైన మాసం. ఈ మాసంలోనే వేయి నెలలకన్నా ఎక్కువ శ్రేష్ఠమైన రాత్రి ఒకటుంది. దేవుడు ఈ మాసపు ఉపవాసాలను మీకు విధిగా చేశాడు. రాత్రి ఆరాధనలను నఫిల్‌గా నిర్ణయించాడు. ఎవరైనా దైవప్రసన్నత చూరగొనే ఉద్దేశ్యంతో ఈ మాసంలో సత్కార్యాలు చేస్తే, వారు ఇతర దినాల్లో ఏదైనా ఫర్జ్ (విధిగా

చేయవలసిన పని) నెరవేర్చిన వారవుతారు. ఎవరైనా ఈ మాసంలో ఒక ఫర్జ్ నెరవేర్చితే వారు ఇతర దినాల్లో డబ్భై ఫర్జ్‌లు నెరవేర్చినదానితో సమానం. రమజాన్ సహన మాసం. సహనానికి ప్రతిఫలం స్వర్గం. ఇది ఒండొకరి పట్ల సానుభూతి చూపవలసిన మాసం. ఈ మాసంలో విశ్వాసుల ఉపాధి వృద్ధి చేయడం జరుగుతుంది. ఎవరైనా ఈ మాసంలో ఒక ఉపవాసికి ఇఫ్తార్ (రోజా విరమణ) చేయిస్తే అది అతని పాపాల మన్నింపుకు, నరకం నుండి విముక్తికి ఉపకరిస్తుంది. అంతేకాకుండా ఉపవాసి పుణ్యాలు ఏమాత్రం తగ్గించకుండానే, అతడికీ ఉపవాసం ఉన్నవానితో సమానంగా పుణ్యఫలం లభిస్తుంది.

హజ్రత్ సల్మాన్ (రజి) ఇంకా ఇలా అంటున్నారు: "దైవప్రవక్తా! మాలో ప్రతి ఒక్కరూ ఒక ఉపవాసికి రోజా విరమణ చేయించే భాగ్యానికి నోచుకోలేక పోతేనో?" అని మేము దైవప్రవక్తను అడిగాము. అప్పుడు దైవప్రవక్త (సఅసం): 'భోజనం పెట్టలేకపోయినా, పాలతోగాని, లస్సీతోగాని, ఒక ఖర్జూరంతోగాని, కనీసం మంచినీళ్ళతో ఇఫ్తార్ చేయించినా అంతే పుణ్యఫలం దొరుకుతుంది' అని సెలవిచ్చారు.

మరెవరైనా ఒక ఉపవాసికి కడుపునిండా భోజనం పెడితే దైవం అతడికి నా సరస్సు నీరు తాపిస్తాడు. ఈ నీళ్ళు తాగిన వ్యక్తికి స్వర్గంలోకి ప్రవేశించే వరకూ దాహమే వేయదు. ఇంకా ఈ మాసం మొదటి పది దినాలు కారుణ్య దినాలు. మధ్యలోని పది రోజులు క్షమాపణా రోజులు. చివరి పది దినాలు నరకం నుండి విముక్తి దినాలు. ఎవరైతే రమజాన్ మాసంలో తనవద్ద పనిచేసే నౌకర్లతో తేలికపాటి పనితీసుకుంటాడో, అలాంటి వ్యక్తిని దైవం క్షమించి, నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తాడు." (బైహఖీ)

దైవప్రవక్త (సఅసం) రమజాన్ శుభాలను గురించి, రోజా ప్రాముఖ్య తను గురించి రమజాన్‌కు ముందు షాబాన్ మాసంలోని జుమా ప్రసంగాల్లో ఇతర సామూహిక సమావేశాల్లో హితవు గరిపేవారని మనకు ఈ హదీసువల్ల



అర్థమవుతోంది. ఈ విషయం ఇంతకుముందు కూడా ప్రస్తావించ బడింది. రమజాన్ మాసంలోని జుమా ప్రసంగాల్లో కూడా రమజాన్ శుభాలకు సంబంధించిన ఉపదేశాలు చేసినప్పటికీ, అంతకుముందు షాబాన్ మాసంలో కూడా సాధారణంగా రమజాన్ శుభాల ప్రాముఖ్యతను విశదపరచి ప్రజల్ని మానసికంగా సిద్ధపరిచేవారు.

- 'ప్రజలారా! మీపై ఒక మహోన్నతమైన, శుభాల మాసం అవతరించ బోతోందని' దైవప్రవక్త (సఅసం) ఈ ప్రసంగంలో సెలవిచ్చారు.

  అంటే, ఈ మాసంలోని ప్రతి రోజు, ప్రతి గంట, ప్రతి ఘడియ ఎంతో అమూల్యమైనది, శుభప్రదమైనది. ఇది మనిషి కోరకుండానే లభించే సువర్ణ అవకాశం. దీన్ని ఉపయోగించుకొని మీరు అసంఖ్యాకమైన శుభాలను పొందవచ్చు. ఈ మాసంలో ఒక మనిషి ఎంత ఎక్కువగా దైవారాధనచేస్తే, ఎంత ఎక్కువగా సత్కార్యాలు చేస్తే అంతే ఎక్కువగా అతడి ఆధ్యాత్మిక శక్తి వికసిస్తుంది. మీలో అసంఖ్యాకంగా శుభాలను ప్రోదిచేసే అవకాశాలు ఇందులో ఉన్నాయి కాబట్టే ఈ మాసాన్ని శుభప్రదమైన మాసం, గౌరవప్రదమైన మాసం అని పేర్కొనడం జరిగింది.

- 'ఈ మాసంలో వేయి మాసాలకన్నా విలువైన రాత్రి ఉందని' చెప్పడం జరిగింది.

  అంటే ఆ రాత్రి 'లైలతుల్ ఖద్ర్' అన్నమాట. 'లైలతుల్ ఖద్ర్'లోనే దైవం తన గ్రంథం పవిత్ర ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాడు. 'వేయి మాసాల కన్నా విలువైన రాత్రి' అంటే మానవజాతి సాఫల్యానికి వేయిమాసాల్లో కూడా జరగని పని ఒకే ఒక రాత్రిలో జరిగిందని అర్థం.

- 'దైవం ఈ మాసం ఉపవాసాలను విధిగా చేశాడు. రాత్రులు నిలబడి ఆరాధన చేయడాన్ని నఫిల్‌గా నిర్ణయించాడు.'

'నఫిల్' అంటే మనిషి స్వచ్ఛందంగా (Voluntorly)సంతోషంగా చేసే కార్యం. తనపై అది విధి (ఫర్జ్) కానప్పటికీ స్వచ్ఛందంగా, సంతోషంగా చేయడం అన్నమాట.

రమజాన్ మాసంలో పగటి ఉపవాసాలను ఫర్జ్‌గా, రాత్రి ఆరాధనను నఫిల్‌గా నిర్ణయించి ఈ రెండింటి లాభాలను ఒకచోట జమచేయడం జరిగింది. ఫర్జ్ నెరవేర్చిన లాభాలు వేరే ఉంటాయి. తనపై ఎటువంటి నిర్బంధం లేనప్పటికీ స్వచ్ఛందంగా, సంతోషంగా దైవాన్ని మరింత ప్రసన్నం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో చేసే కార్యాల లాభాలు వేరే ఉంటాయి. మనిషి తన డ్యూటీని తాను నిర్వహిస్తే దాని వేతనం వేరుగా ఉంటుంది. అదే మనిషి తన డ్యూటీ నిర్వహించిన అనంతరం స్వచ్ఛందంగా, సంతోషంగా అదనంగా పనిచేస్తే అతనికి లభించే వేతనం వేరుగా ఉంటుంది. అంటే అతడికి అదనంగా బోనస్ కూడా లభిస్తుంది. అంటే ఈ మాసంలో రెండు అవకాశాలు లభిస్తున్నాయన్న మాట. ఒకటి మీపై డ్యూటీ వేయబడింది. దీని పుణ్యఫలం దీనికే ఉంది. మరొకటి మీరు స్వచ్ఛందంగా ఎక్కువగా సత్కార్యాలు ఆచరిస్తే దానికి అదనంగా పుణ్యఫలం దొరుకుతుంది.

తరువాత ఇలా చెప్పబడింది: "ఎవరైతే ఈ మాసంలో ఒక సత్కార్యం చేసి దైవ ప్రసన్నతను చూరగొనే ప్రయత్నం చేస్తాడో, అలాంటి వ్యక్తికి ఇతర దినాల్లో ఫర్జ్ నెరవేర్చిన దానితో సమానంగా పుణ్యం దొరుకుతుంది. మరెవరైతే ఈ మాసంలో ఒక ఫర్జ్ కార్యం నెరవేర్చితే అతడికి ఇతర దినాల్లో డెబ్భై ఫర్జ్‌లు నెరవేర్చినంత పుణ్యఫలం దొరుకుతుంది."

ఇక్కడ మూలంలో 'ఫరీజత'కు బదులుగా 'ఖస్లతుమ్మినల్‌ఖైర్' అనే పదం వాడబడింది. ఈ పదానికి 'నఫిల్ సత్కార్యం' అని అర్థం వస్తుంది. అంటే ఎవరైనా ఒక వ్యక్తి నఫిల్‌గా భావించి ఒక సత్కార్యం చేస్తే అతడికి ఇతర దినాల్లో విధిగా చేయవలసిన కార్యంతో సమానంగా ప్రతిఫలం లభిస్తుంది.



# రమజాన్ మాసంలో ఈ వ్యత్యాసం ఎందుకు?

రమజాన్ రోజులకు, ఇతర రోజులకు తేడా ఏమిటంటే, సాధారణంగా ఇతర రోజుల్లో మనిషి ఒక పరిమితి మేరకో, లేక కాస్త ఎక్కువగానో, వ్యక్తిగతంగా ఆరాధనలు, విధులు నెరవేరుస్తాడు. కాని రమజాన్ మాసాన్ని యావత్తు ముస్లిం సముదాయానికి సత్కార్యాల సీజన్‌గా పరిగణించడం జరిగింది. జాతియావత్తు ఒకే సమయంలో రోజా పాటించడం, రోజా విరమించడం చేస్తుంది. దాదాపుగా అందరూ ఒకే సమయంలో తరావీహ్ నమాజులు నెరవేరుస్తారు. అలాగే ఇతర ఆరాధనలు కూడా! ఈ విధంగా జాతి మొత్తంలో ఒకే సమయాన ఒక విధమైన సత్కార్యాల వాతావరణం నెలకొంటుంది. అందుకే ఈ సీజన్‌లో సత్కార్యాలు బాగా ఊపందుకుంటాయి.

ఏ విధంగానైతే ఇతర కాలాలకు భిన్నంగా వర్షాకాలంలో చెట్లు బాగా చిగురించి పళ్ళు, పూలనిస్తాయో అదే విధంగా ఇతర మాసాలకు భిన్నంగా రమజాన్ మాసంలో సత్కార్యాలు బాగా వికసిస్తాయి.

రమజాన్ మాసంలో ఒక మనిషి చేసే సత్కార్యాలు తనొక్కడికే కాకుండా అసంఖ్యాక మంది చేసే సత్కార్యాలు కూడా కలగలిసి విపరీతంగా వృద్ధి చెందుతాయి. అదీగాక రమజాన్ సత్కార్యాల ప్రత్యేక సమాహారం కాబట్టి ఈ మాసంలో దైవ శుభాల ప్రత్యేక కారుణ్యం అనంతంగా వర్షిస్తూ ఉంటుంది. ఒక మనిషి నఫిల్ నమాజు చేసినా, సాటివారితో సత్సంబంధాలు నెరపినా, దానధర్మాలు చేసినా దీనిగ్గాను ఇతర దినాల్లో ఫర్జ్ కార్యాలు నెరవేర్చిన దానితో సమానంగా పుణ్యఫలం లభిస్తుంది. అదే విధంగా రమజాన్‌లో ఒక వ్యక్తి విధిగా (ఫర్జ్) చేయవలసిన ఒక కార్యం, అంటే, అది నమాజు అయినా, జకాత్ అయినా, రోజా అయినా నెరవేర్చితే, అతనికి ఇతర దినాల్లో డెబ్భై నమాజులు, డెబ్భై సార్లు జకాతు, డెబ్భైసార్లు రోజాలు పాటించినంత పుణ్యఫలం ప్రసాదించబడుతుంది.

'సబ్ర్' అనే పదానికి అరబీలో బంధించడం, ఆపడం అనే అర్థాలు వస్తాయి. ఇక్కడ 'సబ్ర్' అంటే, మనిషి దైవాదేశాలకు వ్యతిరేకంగా తన్ను తాను, తన మనసును బంధించి ఉంచడం, ఆపడం చేయాలని అర్థం. మరియు దైవాదేశాల హద్దులు మీరకుండా ఉండడం.

ఇక్కడ 'సబ్ర్' (సహనం) ప్రతిఫలం స్వర్గం అని సెలవీయబడింది. అంటే ఒక మనిషి స్వర్గాన్ని సాధించగలిగాడంటే, అది కేవలం తన మనసును కట్టడిచేసి దైవాదేశాల పరిధిలో తననుతాను నిర్బంధించుకున్నాడని అర్థం.

## సహనాన్ని గురించిన పునశ్చరణ రమజాన్‌లో జరిగినంతగా మరే కాలంలోనూ జరగదు

రమజాన్ మాసంలో మనిషి ఇరవై నాలుగ్గంటలూ సహన పునశ్చరణ చేసుకుంటూ ఉంటాడు. సహరీ సమయం (తెల్లవారుజాము) సాధారణంగా నిద్రలేచే సమయం కాదు. కాని అతడు మేల్కొంటాడు. అది భోజనం చేసే సమయం కూడా కాదు. కాని, దైవం ఈ సమయాన్నే భోజనసమయంగా నిర్ణయించాడని తన మనసుకు చెప్పుకుంటాడు. ఇప్పుడు తినకపోతే పొద్దస్తమానం పస్తుతో మాడిచస్తావని మనసును హెచ్చరిస్తాడు. ఈ విధమైన దైవాదేశపాలనలో మీ మనసు కళ్ళెం మీ చేతిలోకొచ్చేస్తుంది. సాధారణంగా మనసు మనిషి పైన్నే స్వారీ చేస్తూ ఉంటుంది. కాని రమజాన్‌లో పాటిస్తున్న క్రమశిక్షణ మూలంగా మీరే స్వయంగా మనసుపై స్వారీ చేసే స్థాయికి ఎదుగుతారు. ఎప్పుడు దైవాదేశమైతే అప్పుడే తినడం, త్రాగడం మీకు ఇష్టమవుతుంది. రోజాస్థితి మీకు ఎంత భారమనిపించినా (అంటే పగలంతా ఏమీ తినక, తాగక ఉండడం వల్ల) ఎట్టి పరిస్థితిలోనూ మీరు మనసుపై నియంత్రణను కోల్పోరు. దైవాదేశం కాగానే వెంటనే ఇఫ్తార్ చేస్తారు.

'తన దాసుడు రోజా విరమణ (ఇఫ్తార్) కోసం తొందరపడడం దైవానికి



ఎంతో ఇష్టం.' అనే హదీసులు కూడా ముందు ముందు రాబోతున్నాయి. అంటే, ఉపవాసి కేవలం 'దైవాజ్ఞ' కాబట్టి మాత్రమే ఇంత వరకూ ఆగి ఉన్నాడు. లేకపోతే విపరీతంగా ఆకలి, దాహము అవుతుంటే ఒక్క క్షణం కూడా ఆగేవాడు కాదు.

ఈ విధంగా ప్రతి వ్యక్తికీ తన మనసుపై అదుపు సాధించే, సహనం వహించే శిక్షణ గరపడం జరుగుతుంది. ఈ విధమైన పునశ్చరణ ద్వారా అలవరచుకున్న సహనానికి ప్రతిఫలంగా స్వర్గం దొరుకుతుంది. ఎందుకంటే దైవాదేశ పాలనకు మిమ్మల్ని బద్ధుల్నిచేసి, దైవాదేశ ఉల్లంఘన నుండి మిమ్మల్ని కాపాడింది ఈ 'సహన'మే.

☞ తరువాత ఈ మాసం 'మవాసాత్' మాసం అని హదీసులో చెప్ప బడింది. 'మవాసాత్' అంటే 'సానుభూతి చూపడం, ఒండొకరి కష్ట సుఖాల్లో పాలుపంచుకోవడం' అని అర్థం.

రమజాన్‌ను 'షహరుల్ మవాసాత్' అని అనడం అంటే, ఈ మాసంలో ప్రజలు ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకొనేలా వారిని తీర్చిదిద్దడం జరుగుతుంది. ఒక వ్యక్తి స్వయంగా ఆకలి బాధను అనుభవిస్తేనే అతడికి ఇతరుల (అన్నార్తుల, పేదల) ఆకలి బాధలు అర్థమవుతాయి. తద్వారా అతడిలో పరోపకార భావన జనిస్తుంది.

☞ 'ఈ మాసంలో విశ్వాసుల ఉపాధిలో వృద్ధి కలుగుతుంది' అని కూడా ఈ హదీసులో సెలవీయబడింది.

రమజాన్ మాసంలో తన సంపాదన ఎంత పెరిగింది, తన వేతనం ఎంత పెరిగిందీ అని ఏ మనిషి లెక్క పత్రాల ద్వారా నిరూపించలేడుకాని, రమజాన్‌లో వారికి సమకూరే షడ్రుచుల పంచభక్ష పరమాన్నాలు, రకరకాల వంటలు, రకరకాల పళ్ళు, ఫలాలు ఇతర దినాల్లో ఊహించడం కూడా సాధ్యం కాదనేది వేలుకాదు లక్షలాది, కోట్లాది మంది ప్రజల స్వానుభావాలు.

అంటే, ఈ మాసంలో దైవం ఏదో శుభాన్ని విశ్వాసుల ఉపాధిలో తప్పకుండా కలుపుతాడని దీనిద్వారా మనకు అర్థమవుతోంది.

తరువాత ఇలా సెలవీయబడింది “ఎవరైనా ఒక రోజెదార్‌కు ఇఫ్తార్ చేయిస్తే, అతడి పాపాలు క్షమించబడతాయి. అతడి మెడ నరకం నుండి రక్షించబడుతుంది. ఉపవాసం పాటించేవారికి ఎంత పుణ్యం లభిస్తుందో, దాన్ని ఏ మాత్రం తగ్గించుకుండా ఇతనికీ, అతనితో సమానంగా పుణ్యఫలం లభిస్తుంది.”

అంటే, ఇతను ఇఫ్తార్ చేయించాడు కాబట్టి, రోజా పాటిస్తున్నవాడి పుణ్యంలోంచి కొంత తగ్గించి ఇతనికి ఇవ్వడం ఏమాత్రం జరుగదు. ఎందుకంటే దైవ కారుణ్యం అంత సంకుచితం కాదు. ఆయన కారుణ్యం అనంతమైనది. రోజా పాటిస్తున్నవాడికి ఎంత పుణ్యం లభిస్తుందో, అంతే పుణ్యం ఇఫ్తార్ చేయించిన వారికి దైవం వేరుగా ఇస్తాడు.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఎవరైతే తమ గొప్పతన్నాన్ని, తమ దాతృగుణాన్ని చాటుకోవడానికి, అబ్బో ఈయనగారు దైవ మార్గంలో చాలా ఖర్చుపెడతాడని అనిపించుకోడానికి, ప్రదర్శనా బుద్ధితో వ్యవహరించే వారికి ఈ పుణ్యం వర్తించదు.

ఎవరైతే కేవలం దైవ ప్రసన్నత కోసం మాత్రమే ఇఫ్తార్ చేయిస్తారో వారికి మాత్రమే ఈ హదీసు వర్తిస్తుంది. ఇక్కడ కూడా ఒక విషయం గుర్తుంచుకోవడం మంచిది. ధనవంతులకు, ఏ లోటూ లేకుండా ఇఫ్తార్ చేసుకునే వాళ్ళకు చేయించేకన్నా, అంతగా ఇఫ్తార్ ఏర్పాట్లు చేసుకోలేని వారికి, పేదవారికి ఇఫ్తార్ చేయించడం శ్రేయస్కరం.

పై పేరాల్లో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) హితబోధనల ప్రస్తావన తర్వాత, హజ్రత్ సల్మాన్ ఫార్సి(రజి) ఇలా అంటున్నారు, “దైవప్రవక్తా! మాలోని ప్రతి ఒక్కరూ ఒక ఉపవాసికి భోజనం తినిపించే స్థోమత కలిగి లేకపోతేనో?”



అని సహచరులు సందేహం వెలిబుచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) “భోజనం లేకపోయినా ఒక ఉపవాసికి పాలుగాని, లస్సీగాని, ఒక ఖర్జూరం గాని, చివరికి ఓ గుక్కెడు మంచినీళ్ళు త్రాపించినా ఈ పుణ్యఫలం లభిస్తుంది” అని సెలవిచ్చారు.

అంటే, పెద్దఎత్తున ఇఫ్తార్ ఏర్పాట్లు చేసినవారికే ఈ పుణ్యం దక్కుతుందని అనుకుంటే పొరపాటే. ఇది కేవలం రోజా విరమింపచేసిన దానికి ప్రతిఫలం. అది ఎంత సాదా సీదాగా అయినా సరే.

తరువాత మళ్ళీ ఇలా సెలవీయబడింది: “ఎవరైనా ఒక వ్యక్తి ఒక ఉపవాసికి కడుపునిండా భోజనం పెడితే, దైవం అతడికి నా కోనేటి నీరు తాపిస్తాడు. తరువాత అతనికిక స్వర్గంలోకి ప్రవేశించే వరకూ దాహమనేదే ఉండదు.”

హదీసుల్లో ఇలా వస్తుంది : “హష్ర్ మైదానంలో ఒక మంచినీటి సరస్సు ఉంటుంది. దాన్ని ‘కౌసర్ సరస్సు’ అంటారు. ఈ సరస్సు వద్ద స్వయంగా దైవప్రవక్తే (సఅసం) రక్షణగా ఉంటారు. అది ఆయన ఆధీనంలో, ఆయన రక్షణలో ఉంటుంది. దైవప్రవక్త (సఅసం) స్వయంగా త్రాపిన వారు మాత్రమే ఆ నీటిని తాగగలుగుతారు. మరెవరికీ ఆ నీరు త్రాగే అవకాశం లభించదు. ఎవరైనా నీరు త్రాగుదామనుకున్నా ఆ మైదానంలో ఆ ఒక్క సరస్సు తప్ప మరెక్కడా నీరు ఉండదు. స్వర్గార్హుల్ని మాత్రమే దైవప్రవక్త (సఅసం) అక్కడికి రావడానికి అనుమతిస్తారు. మరెవరికీ దాని సమీపానికి వెళ్ళే అనుమతి లేదు. అటువంటి స్థితిలో, ఒక ఉపవాసికి కడుపునిండా భోజనం పెట్టిన వ్యక్తికి దైవప్రవక్త (సఅసం) చేతులతో కౌసర్ సరస్సు నీరు త్రాగే భాగ్యం లభిస్తుంది. దానితో ఇక అతడు నేరుగా స్వర్గంలో ప్రవేశిస్తాడు.

‘హష్ర్’ మైదానం విషయంలో హదీసుల ద్వారా మనకు తెలిసే మరో విషయం ఏమిటంటే – అక్కడ దైవ కారుణ్య ఛాయ తప్ప మరెలాంటి ఛాయ

ఉండదు. అది సచ్ఛీలురకు మాత్రమే లభించే వరం. దుర్మార్గులకు అలాంటి ఛాయ కనుచూపు మేరలో ఎక్కడా ఉండదు.

ఈనాడు, ఇహలోకంలో ఒక ఉపవాసికి కడుపునిండా భోజనం పెట్టిన వ్యక్తికి ఆనాడు 'హష్ర్' మైదానంలో నిరంతరంగా దైవకారుణ్య ఛాయలో చోటు దొరుకుతుంది. ఇక ఆలోచించండి, ఇదెంత మహాభాగ్యమో!!

'ఈ మాసం ఆరంభంలో కారుణ్యం, మధ్యలో క్షమాపణ, చివరిలో నరకం నుండి విముక్తి' అని చెప్పబడింది.

అంటే, ఈ పవిత్ర మాసం రాగానే మీరు ఉపవాసం ప్రారంభిస్తారు. మీరిటు రోజా ప్రారంభించగానే మీపై దైవకారుణ్యం వర్షించడం కూడా ప్రారంభమవుతుంది. ఈ విధంగా మీరు మధ్యలోకి చేరుకోబోతుండగానే దైవం మీ తప్పుల్ని మన్నించివేస్తాడు. దీంతో మీరు క్షమింపబడి పునీతులవు తారు. ఇదేవిధంగా మీరు రమజాన్ చివరి దశకంలోకి ప్రవేశిస్తారు. మీరిటు చివరిరోజా ప్రారంభించగానే అటు మీకు నరకాగ్ని పట్ల ఉన్న భయం నుండి విముక్తి కలుగుతుంది.

ఇటు చివరి రోజా పూర్తికాగానే విముక్తి లభించింది కాబట్టి ఇక మనం స్వేచ్ఛా జీవులం, మన ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తామంటే కుదరదు. విచారకరమైన విషయం ఏమిటంటే, కొంతమంది రమజాన్ పోగానే, రమజాన్‌లో పాటించిన నియమ నిష్టలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తారు.

సరే, రమజాన్ పోతుంది. పండుగ రోజు (షవ్వాల్ మొదటి తేది) ఈద్ నమాజ్ కాగానే సినిమాకు వెళ్ళిపోతారు. కొందరు మరికాస్త ముందుకెళ్ళి డ్యాన్స్‌ప్రోగ్రాముల్లో కూడా పాల్గొంటారు. మరి కొందరు మిత్రులతో కలసి మందు కొడ్తారు, పేకాట ఆడతారు. ఈ విధంగా పండుగరోజు మనసుకు నచ్చిన విధంగా ఎంజాయ్ చేశారు. ఎవరైనా ఇలా చేశారనుకోండి. ఒకవైపు



వారు నరకం నుండి విముక్తి పొందుతూనే, మళ్ళీ నరకంలోకి దూకడానికి కావలసిన ఏర్పాట్లు చేసుకుంటున్నారని అర్థం చేసుకోవాలి.

దైవభీతి, దైవవిశ్వాసం కలిగిన మంచి మనిషి మనసులో ఏ మాత్రం దైవభీతి, విశ్వాసం ఉన్నా ఇలా రెండు పడవలపై కాలుపెట్టడు. దొంగాట అసలే ఆడడు.

'ఎవరైతే రమజాన్ మాసంలో తన సేవకులు, నౌకర్లతో తేలికపాటి పని తీసుకుంటాడో, అలాంటి వ్యక్తిని దైవం నరకం నుండి విముక్తి కల్గిస్తాడు.'

రమజాన్ మాసంలో తానెలా ఉపవాసం ఉన్నాడో, అలాగే తన సేవకులు, ఉద్యోగులు కూడా రోజా ఉన్నారని గుర్తుంచుకోవాలి. తాను రోజా ఉండి నీరసించిపోతున్నప్పటికీ రోజా ఉన్న తన సేవకులతో రోజాలేనివారి మాదిరిగా సేవలు చేయించుకోవడవం ఒక మంచి మనిషికి, దైవవిశ్వాసికి శోభించని లక్షణం. ఎవరైతే రమజాన్‌లో తన నౌకర్ల పనిని తగ్గిస్తారో, వారితో కఠినంగా కాకుండా దయతో వ్యవహరిస్తారో అలాంటి వారికి దైవం నరకం నుండి కాపాడుతాడు.

ఈనాడు కొంతమంది తమ సేవకులతో లేక తమ ఆధీనంలో ఉన్న వారితో చాలా ఎక్కువగా పని చేయించుకుంటారు. రమజాన్ మాసంలోనైతే మామూలుకు భిన్నంగా శక్తికి మించిన పనులు చేయిస్తారు. ఎందుకంటే తమ దగ్గర పని చేసే నౌకర్లు తమ ముందే రోజాలు పాటించడాన్ని వారు జీర్ణించు కోలేక, నోటితో చెప్పలేక ఆచరణ ద్వారా ఇలా ప్రవర్తిస్తారు. అంటే రెట్టింపు పని అప్పగిస్తారు. నౌకర్లు రోజా పాటించడం వల్ల తమ పని కుంటుపడు తుందని, అలాగని రోజా ఉండవద్దనీ చెప్పలేక ఈ రకంగా వారిపై ఒత్తిడి తెస్తారు. కాని ఇలాంటివారు దైవప్రవక్త (సఅసం) ఉపదేశించిన ఒక విష యాన్ని బాగా అర్థం చేసుకొని గుర్తుంచుకోవాలి. ఆయన ఇలా ఉపదేశించారు: "మీ దగ్గర సేవకుడు ఉన్నట్లయితే అతనితో ఎక్కువగా పని చేయించుకోకండి.

(మూలంలో 'ఖాదిమ్' అనే పదం కాకుండా 'మమ్లూక్' అనే పదం వాడబడింది) అతడి పట్ల దయతో వ్యవహరించండి. అన్ని రకాలుగా అతడికి వెసులుబాటు కల్పించండి. ఫలితంగా దైవం మిమ్మల్ని నరకాగ్నినుండి కాపాడుతాడు."

## సహెరీ తినడంలో శుభం ఉంది

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు: "సహెరీ తినండి. సహెరీ తినడంలో శుభం ఉంది." (ముత్తఫకున్ అలైహె)

ఇస్లామీయ ఆరాధనలకు, ఇతర మతాల ఆరాధనలకు మధ్య ఓ ప్రస్ఫుటమైన సైద్ధాంతిక వ్యత్యాసముంది. ఈ వ్యత్యాసం కారణంగా వాటి శుభాల్లో, లాభాల్లో కూడా అలాంటి వ్యత్యాసమే గోచరిస్తుంది.

ఆ సైద్ధాంతిక భేదం ఏమిటంటే, దైవప్రసన్నతకోసం, ఆత్మ వికాసం కోసం మనిషి తన శరీరాన్ని బాధలకు గురిచేయడం, దాన్ని శుష్కింపజేయడం అవసరమనే భావన ఇతర మతాల్లో ఉంది. ఉదాహరణకు పస్తులతో చావడం దైవప్రసన్నతకు మార్గమని, దీని ద్వారా దైవాన్ని చేరుకోవచ్చని కొన్ని మతాలు భావిస్తాయి. ఈ విశ్వాసం కారణంగా వారు ఇలాంటివే మరికొన్ని పనులు కూడా చేస్తారు. ఉదాహరణకు ఒకరు బావిలో తలక్రిందులుగా వ్రేలాడితే, మరొకరు భట్టీల్లో మలమల మాడుతుంటారు, మరికొందరు దేశ దిమ్మరులుగా జీవిస్తారు. మరికొందరైతే రక రకాల జంతువులు, కీటకాల ద్వారా తమ శరీరాన్ని చిత్రహింసలకు గురి చేసుకుంటారు. ఈ విధంగా తమకు తాము చిత్ర హింసలకు గురిచేసుకుంటూ దైవప్రసన్నత బడయడానికి ప్రయత్నిస్తారు. కాని ఇస్లామీయ ఆరాధనా విశ్వాసాల్లో ఇవన్నీ మూఢనమ్మకాలు, అజ్ఞానం తప్ప మరేమీకాదు.



## ఇస్లామీయ ఆరాధనల అసలు లక్ష్యం- ఆత్మ సంస్కరణ, ఆత్మ ప్రక్షాళన

దీనికి భిన్నంగా ఇస్లామీయ ఆరాధనలు మానవుడి నైతికశిక్షణ కోసం, సంస్కరణకోసం మాత్రమే నిర్ణయించబడ్డాయి.

ఈ శిక్షణ, సంస్కరణల ద్వారా మనిషి దైవసామీప్యానికి చేరుకుంటాడు. ఉదాహరణకు రోజానే తీసుకోండి. రోజాలో మీరు దైవం కోసం ఆకలి దప్పులు భరించారని, మీ ఈ బాధ వల్ల దైవానికి సంతోషం కలుగుతుందనే భావన అసలు లేనేలేదు. మీరు రోజా పాటించి మీరు ఒక దైవాదేశాన్ని పాటించి మీ సంపూర్ణ విధేయతను చాటుకుంటారు. 'మీరు ఒక నిర్ణీత కాలం వరకు తినండి త్రాగండి. తరువాత మరో నిర్ణీత కాలం వరకు మీరు తినడాన్ని త్రాగడాన్ని మానుకోండి' అని దైవం ఆదేశించాడు. మీరు ఆ ఆదేశాన్ని తు.చ. తప్పక పాటిస్తారు అంతే.

అంటే, మీరు దైవాదేశ బద్ధులని, అవిధేయులు కారనీ అర్థం. అందుకే దైవం ఎప్పటివరకు ఏమీ తినకుండా త్రాగకుండా మానుకోమంటాడో అప్పటి వరకూ మీరు మానుకుంటారు. ఆకలి దప్పులు మిమ్మల్ని ఎంతగా నీరస పరిచినా మీరు ఖచ్చితంగా దైవాదేశాన్ని పాటిస్తారు. మీ ఈ సంపూర్ణ విధేయతే దైవాన్ని సంతోషపరుస్తుంది. ఇలాంటి విధేయతా భావాలను మనుషుల్లో పెంపొందించడం, వాటిని సాధించడమే ఇస్లామీయ ఆరాధనల అసలు లక్ష్యం. అంతేకాని, మిమ్మల్ని కష్టపెట్టడం దైవాభీష్టం కానేకాదు. నిర్ణీత సమయం ముగియగానే ఇకమీరు తినండి, తాగండి అని ఆదేశించగానే, మాకు దైవప్రసన్నత చాలాముఖ్యం అందుకని మేము తినము, అని గనక అంటే, (దైవం క్షమించాలి) 'మేము మాపై, మా ఆత్మలపై ఎంతటి నిగ్రహం, ఆధిక్యత సాధించామో చూడండి' అని దైవానికి వ్యతిరేకంగా ప్రకటించారన్న మాట. ఇలాంటి వారిని దైవం క్రైస్తవ సన్యాసులను శిక్షించిన విధంగా శిక్షిస్తాడు.

# ఇస్లాంలో ఆరాధనల భావన.....

ఇక్కడ ఎప్పుడైతే తినండి, త్రాగండని అనుమతినివ్వడం జరుగుతుందో వెంటనే ఆ అనుమతిని సద్వినియోగం చేసుకోవడం మీ విధి అయిపోతుంది. మీ ప్రభువు అనుమతిని సద్వినియోగం చేసుకుంటూ, దాని శుభాలను పొందుతుంటే దైవం సంతోషిస్తాడు. ఆయన నిర్ణయించిన హద్దుల్ని అతిక్రమించినప్పుడు మాత్రమే ఆయన మిమ్మల్ని ఆగ్రహిస్తాడు. అల్లాహ్ ఎక్కడ ఏ విషయాన్ని గురించి మిమ్మల్ని వారించాడో అక్కడ ఆ ఆదేశాలను వ్యతిరేకించడం ఆయన అయిష్టానికి దారితీస్తుంది. అంతేగాని, ఆయన అనుమతించిన తర్వాత భోజనం చేయడం ఆయన అయిష్టానికి కారణం కానేకాదు.

మంచి ఆహారం కూడా దైవమే మీకోసం పుట్టించాడు కదా! మరలాంటప్పుడు మీరు వాటి రుచులను ఆస్వాదిస్తే దైవం ఎందుకు ఆగ్రహిస్తాడు? అందుకని ఎప్పుడు పస్తులుండమంటే అప్పుడే ఉండాలి. ఎప్పుడు తినమంటే అప్పుడే తినాలి.

ఈ కారణంగానే ఇస్లామీయ ఉపవాసాలకు, ఇతర మతాలవారి ఉపవాసాలకు ప్రస్ఫుటమైన వ్యత్యాసం కనబడుతుంది. ఈ వ్యత్యాసం ప్రారంభంలో, చివర్లో రెండుచోట్లా వ్యక్తమవుతుంది.

క్రైస్తవుల ఉపవాసాల్లో సహెరీ భుజించడం లేనేలేదు. వారి ఉపవాసం సూర్యాస్తమయం తరువాత ప్రారంభమవుతుంది. రాత్రే వారు తింటారు. తరువాత రెండోరోజు సూర్యాస్తమయం వరకూ ఆ రోజా కొనసాగుతుంది. కాని వారిలో కూడా కొంతమంది దైవభీతిపరాయణులుగా భావించుకునేవారు ఆ రోజు ఉపవాసం విరమించగానే మరో ఉపవాసం ప్రారంభిస్తారు. మరి కొంతమందైతే ఒకే ఒక్క గింజతో రోజా విరమించి వెంటనే మరో రోజా ప్రారంభిస్తారు. అంతేకాదు మరి కొంతమంది మరో అడుగు ముందుకేసి రెండో



రోజు ఉపవాసం కూడా విరమించకుండానే మూడో రోజా ప్రారంభిస్తారు. ఈ విధంగా మూడేసి రోజులు, నాలుగేసిరోజులు ఒక్కో రోజాను పాటించేవారు. మొత్తంమీద ఎవరెంత పెద్ద ఉపవాసం పాటిస్తే వారు అంతగొప్ప దైవ భక్తులుగా, పరిగణింపబడేవారు.

# సహెరీ తినడంలో ఉన్న శుభం ఏమిటి?

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) 'సహెరీ తినండి, సహెరీ తినడంలో శుభం ఉంది' అన్నారు. దీనిలో ఉన్న శుభం ఏమిటంటే, సూర్యోదయానికి పూర్వం నుండి సూర్యాస్తమయం వరకు రోజా పాటించమని ఆయన ఆదేశం. ఈ ఆదేశపాలనలో 'సహెరి' మీకు సహాయకారి అవుతుంది. రోజా ప్రారంభానికి ముందు దైవం మీకిచ్చిన అనుమతిని వినియోగించుకొని భోజనం చేసి, నీళ్ళు త్రాగితే ఇక ఆ రోజల్లా అది మీకు పనికొస్తుంది. కాని మీరలా చేయకపోతే తప్పకుండా మీరు నీరసపడిపోతారు. ఇలా నీరసపడిపోతే మీరు దైవాదేశాలను పాటించడంలో విఫలమవుతారు. ఎందుకంటే దైవం మిమ్మల్ని నెల రోజులూ రోజాలు పాటించమన్నాడు. ఒకవేళ మీరీలోపులోనే నీరసపడి అన్ని రోజాలూ పాటించలేకపోతే..? దైవాదేశపాలనలో మీరు తప్పక విఫలమవుతారు.

అందుకే దైవప్రవక్త (సఅసం) తప్పకుండా సహరీ భుజించమన్నారు. తినడానికి అనుమతి ఉన్న సమయంలో తింటే, తినడానికి అనుమతి లేని సమయంలో దైవాదేశాలను పాలించడానికి మీకు శక్తి లభిస్తుంది.

# గ్రంథప్రజల, ముస్లింల ఉపవాసాల్లోని వ్యత్యాసం

హజ్రత్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "మన ఉపవాసాల్లో, గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల) ఉపవాసాల్లో సహెరీ ముద్ద ఒక్కటే తేడా." (ముస్లిం)

యూదులు, క్రైస్తవులు సహెరీ తినకుండా ఉపవాసం పాటిస్తారు. ముస్లింలు సహెరీ తిని పాటిస్తారు. ఈ విషయం వీరిద్దరి మధ్య ప్రస్ఫుటమైన తేడాను చూపిస్తుంది. తమను తాము బాధించుకోడానికి, హింసించుకోడానికే ఉపవాసం అనేది వారి విశ్వాసం. ఆజ్ఞాపాలనకు అలవాటు చేసేది ఉపవాసం అనేది మన భావన. మనం దైవవిధేయతా మార్గం ద్వారా దైవసామీప్యానికి చేరాలనుకుంటున్నాం. వారు దైవాజ్ఞల్ని తిరస్కరిస్తూ తమను తాము హింసించుకొని ఆ సాకుతో దైవాన్ని చేరాలనుకుంటున్నారు.

## త్వరగా ఇఫ్తార్ చేయడంలో ఉన్న మేలు

హజ్రత్ సుహైల్ (రజి) దైవప్రవక్త (సఅసం) ప్రవచనాన్ని ఇలా వివరించారు: "ప్రజలు రోజా విరమణలో వేగిరపాటు కనబరిచినంతకాలం మేలు బాటన ఉంటారు." (ముత్తఫకున్ అలైహ్)

సూర్యాస్తమయం అయి నక్షత్రాలు ప్రత్యక్షం కానంతవరకూ రోజా విరమించకూడదని యూదులు భావించేవారు. వారిలో కూడా ఎవరు ఎంత ఎక్కువసేపు రోజా విరమించకుండా ఉంటారో వారు అంత గొప్ప దైవభీతి పరులుగా, దైవభక్తులుగా భావించబడేవారు. భోజన సమయం అయినప్పటికీ, అనుమతి ఉన్నప్పటికీ మనిషి అన్న పానీయాలకు ఎంత అతీతంగా వ్యవహరిస్తున్నాడో, ఎంతటి ఆత్మనిగ్రహం కలవాడోనని ప్రజలు భావించాలనే తపన కూడా వారిలో ఉండేది. ఇస్లాంలో ఇలాంటి ప్రదర్శనా బుద్ధికి అసలు తావేలేదు. ఇస్లాంలో ఎప్పటివరకు అల్లాహ్ ఆగమని ఆదేశిస్తాడో అప్పటివరకు కట్టిపడేసిన బందీగా ఆగి ఉండాల్సిందే. కాని అనుమతి లభించిన వెంటనే ఇఫ్తార్‌లో వేగిరపాటు ప్రదర్శిస్తూ దైవశుభాలను దోచుకోవడానికి ప్రయత్నించాలి. ఈ వైఖరే దైవప్రసన్నతకు కారణమవుతుంది. ఎందుకంటే, తన ఆజ్ఞ మూలంగానే అతడు ఇప్పటివరకూ ఆగి ఉన్నాడు లేకపోతే ఆగే సమస్యే ఉండేదికాదు. కేవలం దైవాదేశ పాలనలో తన కోరికలను, ఆకలి దప్పులను,



ప్రతి కదలికను నిర్బంధించుకున్నాడు. ఈ నిర్బంధం తొలగిన వెంటనే ధర్మసమ్మతమైన తన కోరికలన్నింటినీ తీర్చుకోవడం మొదలుపెడతాడు. ఇదే అల్లాహ్‌కు ప్రీతికరమైన విషయం. అందుకే దైవప్రవక్త (సఅసం) 'ప్రజలు రోజా విరమణలో వేగిరపాటు కనబరచినంతకాలం శుభాలు పొందుతారని' ప్రవచించారు. దీంతోపాటు ప్రజలు రోజా విరమణలో ఆలస్యం చేస్తే గ్రంథ ప్రజలకు పట్టుకున్న రోగం మీకూ పట్టుకుంటుందనే హెచ్చరికా ఉంది.

## ఇస్లాం చెడును ఆదిలోనే తుంచుతుంది

ఖుర్‌ఆన్, హదీసుల అధ్యయనం వల్ల ఈ విషయంలో మనకు తెలిసే విషయం ఏమిటంటే, ఒక భయంకర వస్తువు చాలా దూరంలో ఉన్నప్పటికినీ చేరువైన తరువాత ఎలాగూ ఆగిపోవలసిందేకదా అని ముస్లిం ముందుకు సాగిపోకూడదు.

దీనికి భిన్నంగా, ప్రమాద మార్గం ఎక్కడి నుండి ప్రారంభమవుతుందో అక్కడే మిమ్మల్ని ఆపివేస్తుంది ఇస్లాం. ఒక్కడుగు కూడా మ్మిమ్మల్ని ముందకు వేయనివ్వదు. ఇస్లాం వైరాగ్యాన్ని ఎంతమాత్రం ఒప్పుకోదు. అలాంటప్పుడు రోజా విషయంలో, విరమణ (ఇఫ్తార్) సమయం అయిపోయినప్పటికీ శరీరాన్ని హింసించుకొని దైప్రసన్నత పొందవచ్చనే మూఢవిశ్వాసంతో ఆలస్యం చేయడాన్ని ఎన్నటికీ అనుమతించదు. మీరిలా చేస్తే దైవ శుభాలన్నిటికీ దూరమై పుణ్యానికి బదులు పాపం కొనుక్కున్న వారవుతారని తీవ్రంగా హెచ్చరిస్తుంది. వాస్తవానికి దైవాదేశ పాలనలోనే అసలు దైవప్రసన్నత దాగిఉంది. ఆయన విధించిన హద్దుల్ని అతిక్రమించకుండా, ఆయనిచ్చిన అనుమతితో ధర్మసమ్మతమైన మార్గాల్లో ధర్మయుక్తంగా మీ కోరికలు తీర్చుకోవడం ద్వారా మాత్రమే దైవాన్ని సంతోషపర్చగలం. అందుకే దైవప్రవక్త (సఅసం) ఇఫ్తార్‌లో తొందరపాటు వహించినంతకాలం ప్రజలు మేలుబాటన ఉంటారని సెలవిచ్చారు. ఉపవాస విరమణ సమయం నిర్ణయమై ఉంది.

కాబట్టి ఆ నిర్ణీత సమయంలో ఇఫ్తార్ చేయడమే దైవానికి ప్రీతికరం. దైవప్రీతిలోనే మీ శ్రేయస్సు ఉంటుంది.

## ఉపవాస విరమణకు సరైన సమయం

హజ్రత్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం–దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఒకవైపు నుండి రాత్రి రావడం, మరో వైపు నుండి పగలు పోవడం ప్రారంభమై సూర్యుడు అస్తమిస్తే, ఉపవాసి ఉపవాసం విరమించే సమయం అయినట్లు లెక్క." (ముత్తఫకున్ అలైహ్)

అంటే తూర్పు దిక్కున చీకటి రేఖలు పైకెగసి చీకటి పరచుకోవడం ప్రారంభమై, పడమటి దిక్కున సూర్యుడు అస్తమించగానే రోజా విరమణ సమయం అయిపోతుంది. అప్పుడు వెంటనే మీరు రోజా విరమించాలి. సూర్యాస్తమయం అయినా ఆలోచించుకుంటూ ఇఫ్తార్ చేయడంలో ఆలస్యం చేయడం తప్పు మాత్రమే కాదు, ధర్మశాస్త్రానికి విరుద్ధం కూడా! ఇఫ్తార్ సమయం కాగానే క్షణంకూడా ఆలస్యం చేయకుండా వెంటనే ఇఫ్తార్ చేయాలి.

## ఎడతెగని రోజాలు అధర్మం

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) 'విసాల్ ఫిస్సౌం' నుండి వారించారు. అప్పుడొక వ్యక్తి "దైవప్రవక్తా! మీరు కూడా 'విసాల్ ఫిస్సౌమ్' చేస్తారు కదా!" అని ప్రశ్నించాడు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) సమాధానంగా "మీలో నాతో సరితూగే వారెవరున్నారు? నేనే పరిస్థితిలో రాత్రి గడుపుతానో తెలుసా? నాకు నా ప్రభువు తినిపిస్తాడు, త్రాపిస్తాడు" అని సెలవిచ్చారు. (ముత్తఫకున్ అలైహ్)

ఈ హదీసులో ఓ ముఖ్యమైన విషయం ప్రస్తావించబడింది. గ్రంథ వహుల్లో ఉపవాసం పాటించే విధానాలు రకరకాలుగా ఉన్నాయి. 'సౌమె విసాల్' వాటిలో ఒకటి. దీనిలోకూడా మళ్ళీ ఎన్నో రకాలున్నాయి. వీటిలో



ఒకరకం– ఫర్జ్ రోజాలు వదిలేసి కేవలం నఫిల్ రోజాల్ని ఎడతెగకుండా నెల రోజులు, రెండేసి నెలలూ పాటించడం. మరికొందరు దైవం తరఫున విధి అయిన దినాల్లో కాకుండా, వేరే దినాల్లో కూడా ఉపవాసాలు పాటిస్తారు. దీనిలో మరోరకం, 'ఒక వ్యక్తి ఒకసారి సహెరీ తిని రెండవ సహెరీ వరకు (24గంటలు) మధ్యలో ఇఫ్తార్ (విరమణ) లేకుండా రోజా పాటించడం.

కొన్ని సందర్భాల్లో వరుసగా రెండేసి మూడేసి రోజుల పాటు కూడా ఈ రోజా కొనసాగుతుంది. గ్రంథావహుల్లో ఈ రెండు రకాల ఉపవాస విధానాలు అమల్లో ఉండేవి. దైవప్రవక్త (సఅసం) తన అనుచర సమాజాన్ని ఈ రకమైన రోజావిధానాల నుండి వారించారు. ఎందుకంటే ఇది గ్రంథప్రజల (అంటే యూదులు, క్రైస్తవుల) ఆచారం.

ఇక్కడ, 'దైవ ప్రవక్తా! మీరు కూడా 'విసాల్ ఫిస్సౌం' పాటించారు కదా! అనే ప్రశ్న అర్థంకాలేదు. దైవప్రవక్త (సఅసం) ఒక సహెరీ నుండి రెండో సహెరీ వరకు ఎప్పుడైనా రోజా పాటించేవారా? లేకపోతే ఎడతెగకుండా కొన్ని రోజుల పాటు పాటించేవారా? దైవప్రవక్త (సఅసం) ఒక సహెరీ నుండి రెండో సహెరీ వరకు ఎప్పుడూ రోజా పాటించలేదని బలమైన ఆధారాలున్నాయి. అయితే ఎడతెగకుండా నఫిల్ రోజాలు మాత్రం పాటించేవారు. ఒక్కోసారి విడిచి పెట్టేవారు కూడా! అదికూడా దీర్ఘకాలంగా విడిచిపెట్టేవారు.

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఎడతెగకుండా ఉపవాసాలు పాటించడాన్ని మిగతా ముస్లింలందరూ అనుకరించడం అధర్మం. ఎందుకంటే, "మీలో ఎవరూ నాలాగా లేరు, లేక నాతో సరితూగలేరు"అని స్వయంగా దైవప్రవక్త (సఅసం) ప్రకటించారు.

## ఉపవాస సంకల్పం చేసుకోవడం తప్పనిసరి

హజ్రత్ హఫ్సా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్

(సఅసం) ఇలా సెలవిచ్చారు: “ఎవరైతే ఫజర్ (నమాజు)కు ముందు రోజా నిర్ణయం తీసుకోలేదో వారు రోజా ఉన్నట్లుకాదు.”

(తిర్మిజి, అబూదావూద్, నసాయి, దారమి)

ఈ ప్రవచనం ద్వారా మనకు తెలిసేదేమిటంటే, ఏ ఆరాధనకైనా ఉపక్రమించేముందు నేను దీన్ని దైవంకోసం చేస్తున్నానని సంకల్పించుకోవాలి. ఈ విషయం ఎందుకు సెలవీయబడిందంటే, ఒక మనిషి పస్తు ఉన్నప్పుడు కూడా తినడం త్రాగడం చేయడు, కాని మనిషి రోజా ఉన్నప్పుడు నేను ఇప్పటి నుండి దైవాజ్ఞ పాలనలో తినడాన్ని, త్రాగడాన్ని మానుకుంటున్నా నని సంకల్పించుకుంటాడు. ఇదే పస్తుకు, రోజాకు ఉన్న తేడా. ఒకవేళ ఈ సంకల్పమే లేకపోతే రోజా అయినా, పస్తు అయినా ఒకటే కదా!

ఉషోదయం నుండే రోజా ప్రారంభమవుతుంది. అందుకే దైవప్రవక్త (సఅసం) ఉషోదయానికి ముందు నేను దైవం కోసం రోజా పాటిస్తాననే నిర్ణయం తీసుకోండని నొక్కి చెప్పారు. ఒకవేళ మీరిలా చేయకపోతే పస్తుకు, రోజాకు తేడా ఏమిటో మీరు తెలుసుకోలేదన్నమాట.

ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఏ కారణంగానైనా ఒక మనిషి ఉషోదయానికి ముందు సంకల్పం చేసుకోవడం మరచిపోతే అతడి రోజా వృథా అయినట్లని కూడా అర్థంకాదు. తరువాత అతడు 'ఖజా' చేయాలని కూడా కాదు. ఒకవేళ రోజా సంకల్పం మరచిపోతే గుర్తొచ్చిన వెంటనే సంకల్పించు కోవాలి. మీరెప్పుడైతే రోజా ఉందామని సహెరీ కోసం లేచారో అప్పుడే మీ సంకల్పం తేటతెల్లమైపోతుంది. ఒకవేళ రోజా ప్రారంభంలో నేను దైవం కోసమే రోజా ఉంటున్నానని నోటితో పలకడం మరచిపోయినంత మాత్రాన మీ రోజాకేమీ ఢోకా ఉండదు.

అయితే ఇస్లామీయ ధర్మశాస్త్రంలో సంకల్పానికి చాలా ప్రాముఖ్య ముందన్న విషయాన్ని మనం విస్మరించరాదు. సంకల్ప బలంపైన్నే ఆచరణల విలువకూడా ఆధారపడి ఉంటుంది. అందుకే షరీఅత్ దృష్టిలో ఒక ఆచరణకు మించిన ప్రాముఖ్యత, మరో ఆచరణకు ప్రాప్తం కావడానికి ప్రధాన కారణం సంకల్పబలమే. అందుకే ఉషోదయానికి ముందు సంకల్పం చేసుకోండని దైవప్రవక్త (సఅసం) బోధించారు. లేకపోతే బాహ్య ఆచరణ ద్వారా రోజాను పస్తును వేరుచేసే విషయమేదీలేదు.



## సహెరీలో చివరి నిమిషం వరకూ అవకాశం ఉంది

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు: “కంచం మీ చేతుల్లో ఉన్నప్పుడు అజాన్ పిలుపు వినిపించినట్లయితే వెంటనే ఆ కంచాన్ని వదిలేయకండి. మీ అవసరం తీరిన తర్వాతే ఆ కంచాన్ని వదిలేయండి.” (అబూదావూద్)

దైవప్రవక్త (సఅసం) కాలంలో సహెరీ సమయంలో నగారాలు, సైరన్‌లు మోగేవి కావు. సహెరీ సమయం ముగిసిందని చెప్పడానికి అజాన్ పిలుపునిచ్చేవారు. వేసవి కాలంలో ప్రజలు ఆరుబయట పడుకొనేవారు కాబట్టి సాధారణంగా సహెరీ వేళ తెలిసేది. శీతాకాలంలో, వర్షాకాలంలో అయితే ఇండ్లలో సెహ్‌రీ చేసేవాళ్ళంతా సహెరీ వేళ ముగిసిందా లేదా అని మాటి మాటికీ బయటికొచ్చి చూసేవారు. అలా చూడనవసరం లేదని, 'అల్లాహు అక్బర్...' అని అజాన్ పిలుపు వినపడగానే భోజనం చేస్తున్న కంచం వదిలేయ కుండా భోజనం ముగించవచ్చని పై హదీసు తెలియజేస్తుంది.

ఖుర్ఆన్, హదీసు గ్రంథాల్లో సహెరీ తుది సమయాన్ని గురించి వివరంగా ప్రస్తావన ఉంది. దీనివల్ల మనకు తెలిసేదేమిటంటే ఒక నిమిషం అటో ఇటో అయినంత మాత్రాన సహెరీ వేళలో పెద్ద తేడా రాదు. సహెరీ వేళ ముగింపు, ఉషోదయం ప్రారంభ సమయం మనకు తూర్పు దిక్కున కన్పించే ఓ గొప్ప ప్రకృతి దృశ్యం. తూర్పు దిక్కున చూస్తే మొదట్లో మనకు ఓ తెలికపాటి తెలుపు కన్పిస్తుంది. దాంతో మనకు ఉషోదయం (DAWN)

మొదలయిందని, రాత్రి ముగిసి పోతోందని తెలుస్తుంది. కనుక ఉషోదయం వేళ కొన్ని క్షణాల్లోనే రావడం, పోవడం జరిగే పని కాదని మనం గ్రహించాలి. కొందరు తెల్లవారు జామున మేల్కోవడంలో ఎప్పుడైనా కాస్తంత ఆలస్యమైపోతే తొందర తొందరగా సెహ్రీ భోజనం చేస్తూ అజాన్ విన్పించగానే ఠక్కున తినడం ఆపేస్తారు. అలా చేయకుండా మనం తినగలిగినంత అన్నం తొందరతొందరగా తినేయాలి.

పై హదీసులో ఈ విషయమే స్పష్టంగా సెలవీయడం జరిగింది. ఈ సందర్భంలో ఒక విషయం గుర్తుంచుకోవాలి. ఎలాగూ అనుమతి దొరికింది కదా అని తీరిగ్గా తింటూ కూర్చోవడం మంచిది కాదు. వీలైనంత తొందరగా తిని సహెరీ భోజనం ముగించాలి.

## రోజా విరమణలో తొందరపడేవారు దైవానికి ప్రీతిపాత్రులు

హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు- నా దాసులందరిలో ఇఫ్తార్ చేయడంలో తొందరపడేవారు నాకెంతో ప్రియమైన దాసులు." *(తిర్మిజి)*

## ఉపవాస విరమణకు శ్రేష్ఠమైన పదార్థాలు

హజ్రత్ సల్మాన్ బిన్ ఆమిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "మీలో ఎవరైనా ఉపవాస విరమణ చేస్తే ఖర్జూరంతో ఉపవాసం విరమించండి. ఖర్జూరంలో చాలా శుభం ఉంది. ఒకవేళ ఖర్జూరం లేకపోతే నీటితో ఇఫ్తార్ చేయండి. నీరు పరిశుభ్రమైన పదార్థం."

*(అహ్మద్, తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ, దారమి)*

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఆచరణ విధానం గురించి హజ్రత్ అనస్ (రజి) ఇలా తెలుపుతున్నారు: "ఆయన (స) మగ్రిబ్ నమాజు చేసే



ముందు కొన్ని తాజా ఖర్జూర పండ్లతో ఉపవాసం విరమించేవారు. తాజా పండ్లు దొరక్కపోతే ఎండు ఖర్జూరంతో, అవీ లేకపోతే మంచినీటితో ఉపవాసాన్ని విరమించేవారు." *(తిర్మిజి, అబూదావూద్)*

దైవప్రవక్త (సఅసం) ఇఫ్తార్ చేసిన తర్వాత నమాజు చేసేవారు. ఇఫ్తార్‌లో తాజా ఖర్జూరాలు వాడేవారంటే అప్పటికప్పుడు చెట్టునుండి కోసినవని అర్థంకాదు. మనం సాధారణంగా వాడే పచ్చి ఖర్జూరాలని ఇక్కడ అర్థం చేసుకోవాలి. అవిలేని పక్షంలో ఎండు ఖర్జూరం, అవీలేకపోతే మంచి నీళ్ళతో నైనా రోజా విరమించ వచ్చు.

## రోజా విరమణ చేయించేవారి పుణ్యఫలం

హజ్రత్ జైద్ బిన్ ఖాలిద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం: దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా సెలవిచ్చారు: 'ఉపవాసికి రోజా విరమణ చేయించే వారికి లేక యోధుడికి యుద్ధసామగ్రి సమకూర్చేవారికి ఉపవాసం ఉన్నవారితో లేక జిహాద్‌లో పాల్గొన్నవారితో సమానంగా పుణ్యఫలం లభిస్తుంది." *(బైహఖీ, ముహియుస్సున్నహ్)*

సత్కార్యాలు చేసేవారికి ఎలాగూ దాని పుణ్యఫలం లభించి తీరుతుంది. కాని ఎవరైతే సత్కార్యాలకై ప్రోత్సహిస్తారో, దానిక్కావలసిన ఏర్పాట్లు చేస్తారో వారిక్కూడా పుణ్యఫలం లభించాలనేది షరీఅత్ నియమం. అందుకు సత్కార్యాలు చెయ్యమని చెప్పేవారిక్కూడా షరిఅత్‌లో ప్రతిఫలం నిర్ణయమై ఉంది. హదీసులో ఇలా వస్తుంది, 'అద్దాల్లు అలల్‌ఖైరి కఫాయిలిని' అంటే, 'సత్కార్యం చేయమని చెప్పడం స్వయంగా సత్కార్యం చేసిన దానితో సమానం.'

## ఇఫ్తార్ సమయంలో దైవ ప్రవక్త (స) చేసిన దుఆలు

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) దైవప్రవక్త (సఅసం) ఆచరణా విధానాన్ని ఇలా వివరించారు, "దైవప్రవక్త (స) ఇఫ్తార్ చేసిన తర్వాత' దప్పిక

తీరింది, నరాలు చిమ్మగిల్లాయి, దైవం తలిస్తే' పుణ్యం లభిస్తుంది అనేవారు."

*(అబూదావూద్)*

రోజా విరమణ సమయంలో ఆయన (స) చేసే దుఆల్లో ఇదికూడా ఒకటి. **"అల్లాహుమ్మ లకసుమ్తు వఅలారిజ్ఖిక అఫ్తర్తు."**

హ్రజత్ ముఆజ్‌బిన్ జుహ్రా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) రోజా విరమణ అనంతరం, 'ఓ అల్లాహ్! నీ కోసమే నేను రోజా (ఉపవాసం) పాటించాను. నువ్వు ప్రసాదించిన ఆహారంతోనే రోజా విరమించాను" అని పలికేవారు. (అబూదావూద్)

ఒక మనిషి దైవం నిర్ణయించిన ఏదైనా ఒక విధిని నెరవేర్చినట్లయితే, ఆ కార్యం స్వతహాగా ఒక ప్రత్యేకతను, ఒక విలువను కలిగి ఉంటుంది. ఆ ప్రత్యేకత కారణంగానే అతడు పుణ్యఫలానికి అర్హుడవుతాడు. అయితే ఈ కార్య నిర్వహణా క్రమంలో మనిషి రెండు 'స్థితు'లకు లోనుకావచ్చు. అంటే, ఒక బాధ్యతను, ఒక విధిని నిర్వహించే క్రమంలో మనిషి నిర్లక్ష్యంగానూ వ్యవహ రించవచ్చు. లేదా దైవనామస్మరణలో కూడా ఈ కార్యాన్ని నెరవేర్చవచ్చు. అయితే పుణ్యఫలం, దైవప్రీతి పొందే విషయంలో మాత్రం ఈ రెండు విధానా లకు చాలా తేడా ఉంటుంది. ఉదాహరణకు మీరు నమాజు కోసం ఉజూ చేస్తూ ఉంటారు. ఉజూలో ఏ అవయవాలైతే పొడిగా ఉండరాదో అక్కడల్లా శ్రద్ధతో తడుపుతూ ఉజూ చేస్తారు. దీనివల్ల మీరు నమాజు చేయడానికి నిస్సందేహంగా అర్హులయ్యారు కాని ఉజూ చేసేటప్పుడు అవయవాలు కడుగుతూ మీరు (జిక్ర్) దైవ నామాన్ని స్మరిస్తూ చేశారనుకోండి. అప్పుడు మీరు ఉజూ చేస్తున్న స్థితిలో కూడా దైవాన్ని విస్మరించలేదని అర్థం. ఈ కారణంగా మీ ఉజూ విలువ నిస్సందేహంగా పెరిగిపోయింది.

ఇదే ఉదాహరణ రోజాక్కూడా వర్తిస్తుంది. అంటే, మీరు ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఏమీ తినకుండా, త్రాగకుండా ఉన్నట్లయితే



నిస్సందేహంగా మీ రోజా పూర్తవుతుంది. కాని రోజా పాటిస్తున్న క్రమంలో మీరు దైవాన్ని స్మరిస్తున్నట్లయితే, మీ రోజా విలువ, ప్రాముఖ్యత చాలా పెరిగిపోతుంది. మరో విధంగా చెప్పాలంటే, ఉపవాసం పాటిస్తున్నప్పుడు ఉపేక్ష, నిర్లక్ష్యం కనబరచకుండా దైవనామ స్మరణలో రోజు గడిపినట్లయితే పుణ్యఫలం విషయంలో, దైవప్రీతి విషయంలో ఈ రెండు విధానాల మధ్య భూమ్యాకాశాలంత తేడా గోచరిస్తుంది. అందుకని రోజా పాటిస్తున్న క్రమంలో అవసరమైతే తప్ప ఇతర విషయాలేమీ మాట్లాడకుండా దైవనామాన్ని స్మరించడం అన్ని విధాలా ఉత్తమం.

## ఇఫ్తార్‌లో ఆలస్యం చేయడం యూదులు, క్రైస్తవుల విధానం

"ఎప్పటివరకైతే ప్రజలు ఇఫ్తార్ చేయడంలో వేగిరపడుతుంటారో అప్పటివరకు ఈ ధర్మం ఉన్నతస్థాయిలో, ప్రాబల్య స్థితిలో ఉంటుంది. ఎందుకంటే యూదులు, క్రైస్తవులు ఇఫ్తార్ ఆలస్యంగా చేస్తారు" అని దైవప్రవక్త సెలవిచ్చినట్లు హ్రజత్ అబూహురైరా (రజి) తెలిపారు.

*(అబూదావూద్, ఇబ్నెమాజ)*

దైవప్రవక్త (సఅసం) ఈ చిన్న ప్రవచనంలో ఎన్నో విశేషాలు తెలియ జేశారు:

'ఉపవాస విరమణలో ఆలస్యం చేయడం, సహెరీ తినకపోవడం, ఎడతెగకుండా ఉపవాసాలు పాటించడం-ఇలాంటి పనులన్నీ యూదులు, క్రైస్తవులు చేసేవారు. ఇవే క్రమక్రమంగా వారిని వైరాగ్య స్థితికి తీసుకువెళ్ళి సామూహిక జీవనానికి దూరంగా మారుమూల ఆశ్రమాల్లో, మఠాల్లో ఆశ్రయం పొందేలా చేశాయి. ఇవన్నీ దైవధర్మానికి వ్యతిరేకమైన పనులు. వాస్తవానికి ఈ ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం మానవుల కోసమే పుట్టించబడ్డాయి. అయితే ఈ సమస్తాన్నీ మానవుడు తన ఇష్టానుసారంకాక, సృష్టికర్త ఇష్టాను

సారం, ఆయన నిర్ణయించిన నియమాలకు అనుగుణంగా వినియోగించుకోవాలనేది దైవధర్మం చెప్పే విషయం.

అందుకని దైవధర్మం మీకోసం కల్పించిన వెసులుబాటును, అవకాశాలను పూర్తిగా వినియోగించుకొని శుభాలు పొందండి. సహెరీ, ఇఫ్తార్ విషయాల్లో కూడా ఈ వెసులుబాటును వినియోగించుకోండి. కాని దైవం నిర్ణయించిన హద్దులు మాత్రం అతిక్రమించకండి.

యూదులు, క్రైస్తవులు సహెరీ, ఇఫ్తార్ విషయాల్లో తమ ఇష్టానుసారం వ్యవహరించేవారు. ఇఫ్తార్‌లో ఆలస్యంచేస్తే దైవం సంతోషిస్తాడని తమకుతామే భావించుకునేవారు. కాని ఇది దైవాదేశాలకు వ్యతిరేకం. దైవం ఇచ్చిన వెసులుబాటును వినియోగించుకోకపోవడం అంటే ఆయన ఆజ్ఞను అపహాస్యం చేయడమే.

అందుకే దైవప్రవక్త (స) 'యూదులు, క్రైస్తవులకు వ్యతిరేకంగా మీరు ఇఫ్తార్‌లో తొందరపాటు వహించినంతకాలం మీ ధర్మం ఉచ్ఛస్థితిలో ఉంటుందని బోధించారు.

ఒకవేళ మీరు గనక ఈ హదీసుకు భిన్నంగా వ్యవహరిస్తే మీలో ధార్మిక స్పృహ, ఉత్సాహం సన్నగిల్లి వైరాగ్యం వైపు మొగ్గుచూపే అవకాశం ఉంటుంది. అలాగే, ధర్మ విధానాన్ని వదిలేసి క్రైస్తవుల ఆచార వ్యవహారాలను అనుకరించడం ప్రారంభిస్తే ఇక మీ ధర్మం ప్రాబల్య స్థితిలో ఎలా ఉంటుంది? మీరీ విషయాన్ని పట్టించుకోకపోతే మీ ధర్మం తన అసలు స్వరూపం మారిపోయే ప్రమాదం ఉంటుంది.

ఆదిలోనే మీరీ విషయాల పట్ల శ్రద్ధ వహించకుండా ఒక్కొక్క దాన్నే అనుకరిస్తూపోతే చివరికి మీరు ముస్లిం గుర్తింపునే కోల్పోయే స్థితి రావచ్చు. అందుకని ఎక్కడైతే ప్రమాదసూచిక కనబడిందో అక్కడే ఆగిపోండని ఈ హదీసులో హెచ్చరించడం జరిగింది.



## రోజా విరమణలో, నమాజు చేయడంలో వేగిరపాటు.....

హజ్రత్ అబూ అతియ్య (రహ్మ) ఇలా అంటున్నారు, "నేనూ, మస్రూఖ్ (రహ్మ) ఇద్దరం కలసి హజ్రత్ ఆయిషా (రజిఅన్‌హా) వద్దకెళ్ళి ఇలా అడిగాము, 'విశ్వాసులమాతృమూర్తీ! దైవప్రవక్త అనుచరుల్లోని ఇద్దరిలో ఒకరు ఇఫ్తార్ చేయడంలో, నమాజు చేయడంలో తొందరపాటు వహిస్తారు. రెండవవారు ఈ రెండింటిలోనూ కాస్త ఆలస్యం చేస్తారు.'

'ఇఫ్తార్, నమాజుల్లో తొందరపడేవారెవరు?' అని హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) మమ్మల్ని ప్రశ్నించారు.

"ఇఫ్తార్, నమాజుల్లో తొందరపడేవారు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి)అని మేము విన్నవించాము. అప్పుడామె దైవప్రవక్త కూడా ఇలాగే చేసేవారు" అని పలికారు. ఆలస్యం చేసేది హజ్రత్ అబూ మూసా అష్‌అరీ' అని విన్నవించాము." (ముస్లిం)

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) విధానం ఏమిటంటే, ఇఫ్తార్ సమయం అయిన వెంటనే అటు రోజా విరమించేవారు. ఆ వెనువంటనే నమాజు కోసం నిలబడేవారు. కాని హజ్రత్ అబూమూసా అష్‌అరి (రజి) ఇఫ్తార్ సమయం వచ్చినప్పుడు ఇఫ్తార్ సమయం అయిందా లేదా అని నిర్ధారించుకునేవారు. సూర్యాస్తమయం కాగానే కనబడే ఎర్ర చారను కూడా ఆయన అనుమానించేవారు. అందుకని ఇలాంటి అనుమానాన్ని దూరం చేసుకోడానికి కొన్ని సెకన్లు వేచిచూడడం సమంజసమనే అర్థమవుతోంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ సూర్యాస్తమయం కాగానే రోజా విరమించి, నమాజులో లీనమైపొయ్యేవారు. కాని అబూమూసా అష్‌అరి మాత్రం రోజా విరమణలో కూడా కాస్త నిదానం పాటించేవారు. నమాజులో కూడా! ఈవిధంగా ఆయన ఇతరులు కూడా ఇఫ్తార్ చేసి, నమాజులో పాల్గొనే విధంగా వారికి తోడ్పడేవారు.

ఈ విధానం, తొందరపాటు–ఈ రెండిటిలో కూడా ప్రజలకు కొంత వెసులుబాటు, కొంత ఇబ్బంది ఉంది. ఉదాహరణకు ఇఫ్తార్ అయిన వెంటనే మసీదులో నమాజు ప్రారంభమైతే వెనుకబడ్డవారికి కాస్త ఇబ్బంది కలుగుతుంది. అక్కడున్నవారికి వెసులుబాటు అవుతుంది. కాస్త నిదానం కనబరిస్తే వచ్చేవారికి వెసులుబాటు కలిగినా అక్కడున్నవారికి నిరీక్షించాల్సిన పరిస్థితి వస్తుంది.

మొత్తంమీద ఈ విషయంలో హజ్రత్ ఆయిషా (రజిఅన్హా) ప్రవచనం ప్రకారం దైవప్రవక్త (స) వారి ఆచరణ ఇలా ఉండేది. 'ఆయన (స) ఇఫ్తార్‌లో కూడా తొందరపాటు వహించేవారు. నమాజులో కూడా!'

అంటే, హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ప్రకారం ఆ ఇద్దరు ప్రవక్త సహచరుల్లో ఒకరి విధానం సరైందని, మరొకరిది సరైంది కాదని ఆమె చెప్పారని దీనర్థంకాదు. ఆమె ఒకరి విధానం సరైందని, మరొకరిది కాదని చెప్పలేదు. ఆమె కేవలం దైవప్రవక్త ఆచరణ ఇలా ఉండేదని మాత్రమే చెప్పారు.

అందుకని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఆచరణా విధానంతో పాటు హజ్రత్ అబూముసా అష్అరి (రజి) విధానానికి కూడా షరిఅత్‌లో కొద్దో గొప్పో అవకాశం ఉందని మనం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే ఆయన (రజి) కనబరిచే నిదానం యూదులు, క్రైస్తవులు కనబరిచే విధానం లాంటిది కాదు. ఉద్దేశాలు కూడా వేరు. కేవలం సూర్యాస్తమయ నిర్ధారణ కోసమే ఆయన అలా చేసేవారు. అయితే తెలిసి, కావాలని, దైవభక్తిని ప్రదర్శించడానికి అలా చేయకూడదు.

## 'సహెరీ', ఒక శుభప్రదమైన అల్పాహారం

హజ్రత్ ఇర్బాజ్ బిన్ సారియ (రజి) ఉల్లేఖనం ప్రకారం 'ఒకసారి రమజాన్ మాసంలో దైవప్రవక్త (స) నన్ను తన వెంట సహెరీ చేయడానికి



రమ్మని పిలిచారు. అప్పుడాయన (స) 'శుభప్రదమైన అల్పాహారానికి రా' అన్నారు. *(అబూ దావూద్, నసాయి)*

దైవప్రవక్త (స) ఈ ప్రవచనం ప్రకారం 'సహెరి కేవలం సహెరీయే కాదు ఒక శుభప్రదమైన అల్పాహారం' అని మనకు తెలుస్తోంది.

సహెరి తిని (తెల్లవారుజామున భోంచేసి) ఉపవాసం ఉండడంలో గొప్పేముంది అని యూదులు భావించేవారు. కాని ఇస్లాం ధర్మశాస్త్రంలో ఇలాంటి భావనకు తావేలేదు. పగలు మాత్రమే రోజా పాటించాలనేది దైవ నిర్ణయం. రాత్రి ప్రస్తావన ఇక్కడ లేనేలేదు. కాబట్టి రాత్రి తినే స్వేచ్ఛ ఉందనేది స్పష్టంగా తెలిసే విషయం. ఈ స్వేచ్ఛను చేజేతులా హరించడం ఏ మాత్రం సమంజసం కాదు. రాత్రివేళ మేల్కొని భోజనం చేయడం ఒక శుభప్రదమైన అల్పాహారం. దీని ద్వారానే మనం మన రోజాను ప్రారంభిస్తాము. సహెరీలో ఉన్న వివేకం ఏమిటంటే, రోజా ప్రారంభానికి ముందు ఏదో ఒక ఆహారం తినాలి. దీనివల్ల పగలు ఏవైనా పనులు చేసుకోడానికిగాని, దైవారాధనకు కాని ఎలాంటి ఆటంకం ఉండదు.

అలా కాకుండా ఏమీ తినకుండా రోజా ప్రారంభిస్తే, పొద్దస్తమానం ఆకలిదప్పులతో నీరసించి ఏ పనీ చేసుకోలేము. కనీసం దైవారాధన కూడా చేసే శక్తిలేక ఆపసోపాలు పడుతూ రోజా గడపాల్సి ఉంటుంది. ఇది ధర్మశాస్త్రానికి పూర్తి వ్యతిరేకం.

ధర్మం అభిలషించేదేమిటంటే, మనం దైవాదేశాలను పాటిస్తూ, మన పనులు మనం చేసుకొనే శక్తి మనలో ఉండాలి. ఒక ముస్లింగా మనం నిర్వహించవలసిన విధులు, బాధ్యతలను ఓర్పుతో, నేర్పుతో నెరవేర్చగలగాలి. 'ఇబాదత్' అంటే మనం మన దైనందిన పనులన్నీ వదిలేసి, ఓ మూలన కూర్చొని దైవారాధనలో లీనమైపోవడం అని అర్థం కాదు. 'ఇబాదత్' అంటే ఈ ప్రాపంచిక జీవన పోరాటంలో దారి తప్పకుండా, దైవాదేశ పాలన ఎలా

చేయాలో నేర్పే ఒక ట్రైనింగ్ కోర్సులాంటిది. దీనిద్వారా మాత్రమే మనం పరలోకంలో దైవప్రసన్నత పొందగలం.

## శ్రేష్ఠమైన సహెరీ-ఖర్జూరం

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "విశ్వాసులకు శ్రేష్ఠమైన సహెరీ ఖర్జూరమే" అన్నారు దైవప్రవక్త ముహమ్మద్ (స). *(అబూదావూద్)*

మానవుని సమస్త ఆహార అవసరాలు తీర్చే సామర్థ్యం ఖర్జూరంలో ఉంది. మానవుడికి మరే ఇతర ఆహారం దొరక్కపోయినా ఒక్క ఖర్జూరం దొరికినా సంపూర్ణ ఆహారం దొరికినట్లే. ప్రస్తుత పరిశోధనల ప్రకారం మానవుడు సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా, శక్తి సామర్థ్యాలు కలవాడుగా ఉండడానికి అతడి ఆహారంలో ఎన్ని క్యాలరీలు అవసరమో అవన్నీ ఖర్జూరంలో ఉన్నాయి. ఈ కారణంగానే ఆ కాలంలో సైన్యాలు ఎడారి ప్రాంతాల్లో చాలా కాలంపాటు బసచేయాల్సి వచ్చినప్పుడు, మరే ఆహారం సమకూరే అవకాశం లేనప్పుడు ఖర్జూరం నిలువ చేసుకొని నెలల తరబడి ఖర్జూరంతోనే తమ ఆహార అవసరాలు తీర్చుకునేవి.

ఖర్జూరం ఇంత పౌష్టికాహారం కాబట్టే, దీనిలో ఇన్ని శుభాలు ఉండబట్టే దైవప్రవక్త (సఅసం) ఖర్జూరాన్ని శ్రేష్ఠమైన 'సహెరీ' అన్నారు. సహెరీలో ఖర్జూరం తినడం వల్ల పగలు ఉపవాసకులలో శక్తిసామర్థ్యాలు వృద్ధి చెందుతాయి. తద్వారా దైవారాధన, ఇతర పనులు చేసుకొనే శక్తి లభిస్తుంది.

## వేయి మాసాలకన్నా ఘనమైన రాత్రి

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు: "శుభవంతమైన రమజాన్ మాసం మీ వద్దకు వచ్చేసింది. ఈ మాసంలో ఉపవాసాల పాటింపును దైవం మీకు



విధిగా చేశాడు. ఈ మాసంలో ఆకాశ (స్వర్గ) ద్వారాలు తెరవబడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. తలబిరుసు షైతానులు బంధించబడతారు. వేయి మాసాలకన్నా విలువైన రాత్రి ఈ మాసంలో ఉంది. ఎవరైతే ఈ రాత్రి శుభాలను పొందలేకపోయారో వారు దురదృష్టవంతులు." *(అహ్మద్, నసాయి)*

ఈ హదీసు కూడా దైవప్రవక్త (స) రమజాను రాకను పురస్కరించుకొని తన అనుయాయులనుద్దేశించి చేసిన ప్రసంగాల్లోని ఒక భాగమే. రమజాన్ మాసం శుభాలను దాని ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యతను అనుచరులకు బోధించి వారిని చైతన్యవంతుల్ని చేయడం కోసం దైవప్రవక్త (సఅసం) రమజాన్ ప్రారంభ దశలో ఇలాంటి ప్రసంగాలు చేసేవారు.

ఈ హదీసులో చెప్పబడిన మొట్టమొదటి విషయం "రమజాన్ చాలా శుభవంతమైన మాసం. ఈ మాసం ఉపవాసాలు ముస్లిం సముదాయంపై విధిగా నిర్ణయించబడ్డాయి" అనేది.

మూలంలో 'బర్కత్' (ముబారక్) అనే పదం వాడబడింది. 'బర్కత్' అంటే వృద్ధి, వికాసము, ఆధిక్యము అనే అర్థాలున్నాయి. రమజాన్ మాసాన్ని 'ముబారక్ మహీన' అనడం అంటే ఈ మాసంలో మేళ్ళు, శుభాలు, సత్కార్యాలు వృద్ధి చెందుతాయి, వికసిస్తాయి అని అర్థం. దుష్కార్యాలు పెరిగే బదులు తగ్గిపోతాయి. తగ్గిపోవడమే కాదు ఆగిపోతాయి కూడా.

రెండవ విషయం: 'ఈ మాసంలో ఒక రాత్రి ఉంది. అది వేయి మాసాలకన్నా విలువైనది' అని చెప్పడం జరిగింది.

అంటే 'లైలతుల్ ఖద్ర్' అని భావం. ఈ రాత్రిలోనే పవిత్ర ఖుర్ఆన్ అవతరించింది. పవిత్ర ఖుర్ఆన్‌లో ఇలా ఉంది:

**"ఇన్నా అన్‌జల్‌నాహు ఫీ లైలతిల్ ఖద్‌రి, వమా అద్‌రాక మా లైలతుల్ ఖద్ర్. లైలతుల్ ఖద్రి ఖైరుమ్మిన్ అల్ఫిషహ్ర్."**

'మేము ఈ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) 'షబెఖద్ర్'లో అవతరింపజేశాము. 'షబెఖద్ర్' (విలువైన రాత్రి) ఏమిటో మీకు తెలుసా? ఈ రాత్రి (షబెఖద్ర్) వేయి మాసాల కన్నా ఘనమైన రాత్రి.

వాస్తవానికి పవిత్ర ఖుర్ఆన్ అవతరణ మానవాళి పాలిట ఓ శుభాల పంట. మానవాళికి ఇంతకు మించిన శుభాలు మరేం కాగలవు?

అందుకే పవిత్ర ఖుర్ఆన్ అవతరించిన రాత్రిని వేయి మాసాలకన్నా ఘనమైన రాత్రి అని పేర్కొనడం జరిగింది.

మరో విధంగా చెప్పాలంటే, ఈ ఒక్క రాత్రిలో మానవాళికి జరిగిన మేలు ఏ వేయి నెలల మానవజాతి చరిత్రలోనూ జరిగి ఉండలేదు. వేయి మాసాలంటే అర్థం లెక్కబెట్టి వేయి మాసాలని కాదు. అంతకంటే ఎంతో ఎక్కువ అని అర్థం.

ఈ విలువైన రాత్రి ఎవరైతే దైవం వైపుకు మరలి, ఆయన ఆరాధనలో సంపూర్ణంగా లీనమవుతారో వారు గొప్పశుభాలను పొందిన వారవుతారు. ఒక మనిషి ఈ రాత్రి దైవం వైపుకు మరలాడంటే, అతడికి ఈ రాత్రికున్న ఘనత పట్ల పూర్తి అవగాహన ఉన్నదని అర్థం. ఈ రాత్రి దైవం తన గ్రంథాన్ని అవతరింపజేసి మానవ జాతికి చేసిన మేలుకు కృతజ్ఞతగా అతడు దైవం ముందు మోకరిల్లి తన విధేయతను చాటుకుంటున్నాడని అర్థం చేసుకోవాలి.

## ఈ రాత్రి శుభాలను పొందలేనివారు అభాగ్యులు

అంటే, ఎవరైనా ఈ రాత్రి దైవారాధనలో నిలబడలేదంటే వారికి దైవం అవరింపజేసిన గ్రంథం పట్ల, దాని గొప్పదనం పట్ల సరైన అవగాహన లేదని అర్థం. వారికి ఈ విలువైన రాత్రి గురించి, దైవగ్రంథం గురించి ఏమాత్రం అవగాహన ఉన్నా వారు తప్పకుండా దైవం సన్నిధిలో హాజరై కృతజ్ఞతలు చెల్లించుకునేవారే. తినడానికి తిండి, కట్టుకోడానికి బట్ట, ఉండడానికి గూడు



ఇంకా అసంఖ్యాక అవసరాలు తీర్చావు, పవిత్ర ఖుర్ఆన్ లాంటి మహా గ్రంథాన్ని అవతరింపజేసి అజ్ఞానపు చీకట్లలో తచ్చాడుతున్న మాకు వెలుగుబాట చూపావు. ఈ బాటపై నడవబట్టే నేనీ రోజు రుజుమార్గంలో ఉన్నాను అని దైవం ముందు సాగిలపడి కృతజ్ఞతాంజలులు ఘటించాలనుకునే వారు మాత్రమే ఈ రాత్రిన తమ ప్రభువు ముందు నిలబడగలుగుతారు. దాని శుభాలను జుర్రుకోగలుగుతారు. కాని ఎవరైతే దైవానికి కృతజ్ఞతలు చెల్లించ డానికి ఈ రాత్రి ఆరాధన కోసం సమాయత్తంకారో వారు నిజంగా ఎంతో దురదృష్టవంతులని చెప్పాలి.

## రోజా, ఖుర్ఆన్ దాసునికి సహాయపడతాయి

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఇలా ఉపదేశించారు: "రోజా, ఖుర్ఆన్ దాసునికి సహాయపడతాయి. రోజా ఇలా అంటుంది, 'దేవా! నేను ఇతణ్ణి పగలంతా తినకుండా, తాగకుండా, కోరికలు తీర్చుకోకుండా ఆపిఉంచాను. కనుక ప్రభూ! ఇతని విషయంలో నా సిఫారసును స్వీకరించు."

ఖుర్ఆన్ ఇలా అంటుంది, 'ఓ అల్లాహ్! నేను రాత్రులు ఇతణ్ణి నిద్రపోనీ కుండా ఆపి ఉంచాను. కనుక ఇతడి విషయంలో నా సిఫారసును స్వీకరించు.' అప్పుడు ఈ రెండింటి సిఫారసులూ స్వీకరించబడతాయి." (బైహఖీ)

రోజా, ఖుర్ఆన్‌లు ఈ విధంగా సిఫారసుచేయడానికి అవేమన్నా ప్రాణమున్న జీవులా? దీని అర్థం ఏమిటంటే, ఒక ఉపవాసి రోజా ఉండడం, ఒక చదువరి ఖుర్ఆన్ పారాయణం చేయడం అంటేనే అతడిలో ఆ గుణం ఉన్నట్లు లెక్క.

ఉపవాసి విషయంలో ఉపవాసాన్ని దైవం ముందు ప్రవేశపెట్టబడి నప్పుడు, ఈ దాసుడు మీ కోసం పగలంతా ఆకలి దప్పులతో గడిపాడు.

దొంగచాటుగా ఆకలిదప్పులు, ఇతర కోరికలు తీర్చుకునే అవకాశం ఉన్నా అతడలా చేయలేదు. కేవలం మీ ప్రసన్నత కోసమే అతడలా చేయలేదు. కనుక ఇతని తప్పులు క్షమించండి.

ఇదేవిధంగా ఒక వ్యక్తి రాత్రి వేళల్లో ఖుర్ఆన్ పారాయణం చేస్తాడు. ఈ మనిషి ఈరోజు ఇంత ఖుర్ఆన్ చదివాడని దైవం ముందు ప్రవేశపెట్ట బడడమే అతడి సిఫారసుకు నిదర్శనం. ఈ దాసుడు పగలంతా ఉపవాసంతో అలసిపోయి ఉన్నప్పటికీ కేవలం మీ సంతోషం కోసమే ఇతడు రాత్రుల్లో (సమాజుల్లో) నిలబడి ఖుర్ఆన్ పారాయణం చేశాడు. కనుక ప్రభూ! ఇతన్ని మన్నించు అంటుంది ఖుర్ఆన్.

దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రళయదినాన ఏ విధంగా విశ్వాసులు, సచ్ఛీలుర కోసం సిఫారసు చేస్తారో, అలాగే మానవుల ఆచరణలు కూడా స్వయంగా వారి విషయంలో సిఫారసు చేస్తాయి. ఈ మనిషి ఈ సత్కార్యాలు ఆచరించి వచ్చాడు. అందుకని ఇతన్ని మన్నించు అని సిఫారసు చేస్తాయి. దైవప్రవక్త (సఅసం) ప్రవచనం ప్రకారం 'దైవం తన దాసుని విషయంలో రోజా, ఖుర్ఆన్‌ల సిఫారసును స్వీకరిస్తాడు.'

## 'లైలతుల్ ఖద్ర్' శుభాలకు నోచుకోనివారు దౌర్భాగ్యులు

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం రమజాన్ మాసం రాగానే దైవప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "మీకోసం ఈ మాసం వచ్చింది. ఈ మాసంలో వేయి మాసాలకన్నా విలువైన ఒక రాత్రి ఉంది. దీని శుభాలకు దూరంగా ఉన్నవారు నిజంగా ఎంతో దౌర్భాగ్యులు. ఎవరైతే దీని శుభాలను పొందలేరో వారు దురదృష్టవంతులు." *(ఇబ్నెమాజ)*

ఇక్కడ 'లైలతుల్ ఖద్ర్' ఘనతను గురించి, దాన్ని పొందడం వల్ల కలిగే శుభాలను గురించి మాత్రమే ప్రస్తావించడం జరిగింది. కాని, ఆ రాత్రి ఫలానా



రాత్రి అని ఖచ్చితంగా నిర్ధారించి చెప్పలేదు. దైవప్రవక్త (సఅసం) చెప్పిన ప్రకారం 'ఆ రాత్రి రమజాన్ మాసపు చివరి రాత్రుల్లోని బేసి రాత్రుల్లో వస్తుంది. అంటే అది 21వ రాత్రే కావచ్చు, 23వ రాత్రే కావచ్చు, 25వ రాత్రే కావచ్చు, 27వ రాత్రే కావచ్చు, లేదా 29వ రాత్రే కావచ్చు. సాధారణంగా చాలామంది భావిస్తున్నట్లు 27వ రాత్రి షబెఖద్ర్ అని ఖచ్చితంగా చెప్పడానికి ఆధారాల్లేవు. కాని చివరి దశకంలోని బేసి రాత్రుల్లో ఒక రాత్రి అని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. దీనికి ఆధారాలున్నాయి.

ఇంత గొప్పరాత్రి ఫలానా రాత్రి అని దైవం ఎందుకు చెప్పలేదనే సందేహం కూడా మనలో కొందరికి ఉత్పన్నం కావచ్చు. బహుశా ఆ రాత్రిని అన్వేషించే తాపత్రయంలో తన దాసులు సాధ్యమైనంత ఎక్కువగా ఆరాధనల్లో గడపాలనీ, తమ పాపాల క్షమాపణ కోసం వారు మరింత అధికంగా ఆయన్ని వేడుకోవాలనేది పరమ దయాళువు అయిన అల్లాహ్ ఉద్దేశం కావచ్చు.

## చివరి దశకంలో ప్రవక్త (స) ఆరాధనలపట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరిచేవారు

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (సఅసం) రమజాన్ చివరి పదిరోజులు దైవారాధనలో ఎంత శ్రమపడేవారో, మరేకాలంలోనూ అంత శ్రమపడేవారుకాదు." *(ముస్లిం)*

## రమజాన్ చివరి దశకంలో దైవప్రవక్త ప్రత్యేక ప్రార్థనలు

హజ్రత్ ఆయిషా (రజిఅన్హా) ఉల్లేఖనం: "రమజాన్ చివరి దశకం రాగానే దైవప్రవక్త (సఅసం) (ఆరాధనల కోసం) నడుంబిగించేవారు. రాత్రంతా మేల్కొనేవారు, ఇంటివారినీ మేల్కొలిపేవారు." *(ముత్తఫకున్ అలైహ్)*

దైవప్రవక్త (సఅసం) దైవదాస్య నిర్వహణలో ప్రతి రోజూ ఎంతో శ్రమించేవారు. కాని హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ప్రకారం రమజాన్ చివరి పదిరోజుల్లో ఆయన (సఅసం) అత్యంత తీవ్రంగా శ్రమించేవారు.

## లైలతుల్ ఖద్ర్ దుఆ - (ప్రార్థన)

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా సెలవిస్తున్నారు: "నేను దైవప్రవక్త (స)ను ఇలా అడిగాను– దైవప్రవక్తా! 'లైలతుల్ ఖద్ర్' ఫలానా రాత్రి అని నాకు తెలిస్తే నేను ఆ రాత్రి దైవాన్ని ఏం అర్థించను?' దానికి దైవప్రవక్త (స) 'నా ప్రభూ! నువ్వు అమితంగా క్షమించేవాడివి, క్షమించడమంటే నీకు మహాఇష్టం, కనుక నన్ను క్షమించు" అని ప్రార్థించు అన్నారు. *(అహ్మద్, ఇబ్నెమాజ, తిర్మిజి)*

## 'లైలతుల్ ఖద్ర్'ను చివరి దశకంలో వెదకమని హితవు

హజ్రత్ అబూ బక్ర్ (రజి) కథనం ప్రకారం – "లైలతుల్ ఖద్ర్‌ను రమజాన్ మాసం 21, 23, 25, 27, 29వ రాత్రుల్లో అన్వేషించమని దైవప్రవక్త (సం) బోధించారు." *(తిర్మిజి)*

## 'లైలతుల్ ఖద్ర్' (విలువైన రాత్రి) ప్రతి రమజాన్‌లో సంభవిస్తుంది

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సఅసం)ను లైలతుల్ 'ఖద్ర్' గురించి ప్రశ్నించినప్పుడు "అది ప్రతి రమజాన్‌లో వస్తుంది" అని సెలవిచ్చారు ఆయన. *(అబూదావూద్)*

ఖుర్ఆన్ అవతరించిన రాత్రిని ఖుర్ఆన్ 'లైలతుల్ ఖద్ర్' అని పేర్కొంది. అది రమజాన్‌లోని ఒక రాత్రి. ఇలా లైలతుల్ ఖద్ర్ ప్రతి రమజాన్‌లోని ఒక రాత్రి అవుతుంది. అది చివరి దశకంలోని బేసి రాత్రుల్లో ఒక రాత్రి.



## ఏతెకాఫ్‌లో దైవప్రవక్త (స) సంప్రదాయం

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా సెలవిస్తున్నారు: దైవప్రవక్త (స) రమజాన్ మాసంలోని చివరి పదిరోజులు 'ఏతెకాఫ్' పాటించేవారు. దైవం తన వద్దకు పిలుచుకొనే వరకూ ఆయన ఈ సంప్రదాయం కొనసాగించారు. దైవప్రవక్త (సఅసం) తదనంతరం ఆయన సహధర్మచారిణులు ఏతెకాఫ్ పాటించేవారు." *(ముత్తఫకున్ అలైహ్)*

'ఏతెకాఫ్' అంటే తనను తాను ఆపి ఉంచడం, ఒక విషయంపై స్థిరంగా ఉండడం, నిమగ్నమవ్వడం, లీనమవ్వడం లాంటి అర్థాలున్నాయి. షరిఅత్ పరిభాషలో 'ఏతెకాఫ్' అంటే, మనిషి ఒక ప్రత్యేక పంథాలో మసీదులో ఆగి ఉండడం. మసీదులో ఉండడాన్ని, తనను తాను అక్కడ ఆపి ఉంచడాన్ని ఏతెకాఫ్ అంటారు.

దైవప్రవక్త (సఅసం) రమజాన్ చివరి పదిరోజులు మసీదులో నివాసముండేవారు. జీవితాంతం ఆయన విధానం ఇలాగే సాగింది.

ప్రవక్తవారి సతీమణులు తమ ఏతెకాఫ్ మస్జిదె నబవీలో కాకుండా తమ తమ గృహాల్లోనే పాటించేవారు. వీరి గృహాలు ప్రవక్త మసీదును ఆనుకొనే ఉండేవి. వీటి ప్రతి ద్వారం మసీదులోకి అనుసంధానంగా ఉండేది. దైవప్రవక్త (స) ఏ సతీమణి ఇంట్లో ఉన్నా నేరుగా మసీదులోకి ప్రవేశించే వీలుండేది. ఎందుకంటే వాటి ద్వారాలు మసీదు గోడలకే ఉండేవి. ప్రవక్త సతీమణులు తమతమ గదుల్లోనే ఏతెకాఫ్ పాటించడానికి ఇదికూడా ఒక కారణం. వారు హాయిగా తమ గృహాల్లోనే ఏతెకాఫ్ పాటించేవారు.

## రమజాన్‌లో దైవప్రవక్త దాతృత్వం, జిబ్రీల్ తో కలసి ఖురాన్ పఠనం

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (సఅసం) సత్కార్యాల విషయంలో సాధారణంగా మానవులందరిలోకెల్లా ఎక్కువ దాతృ

స్వభావులు. ముఖ్యంగా రమజాన్‌లో ఆయన (స) దాతృత్వం విపరీతంగా పెరిగిపోయేది. రమజాన్ రోజుల్లో జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చినప్పుడు ఆయన (స) జిబ్రీల్‌కు ఖుర్‌ఆన్ వినిపించేవారు. జిబ్రీల్ (అ) ఆయన్ను కలుసుకున్నప్పుడు సత్కార్యాల విషయంలో ఆయన దాతృత్వం వీచే గాలి కన్నా వేగంగా ఉండేది." *(ముత్తఫకున్ అలైహ్)*

ఎప్పుడైతే ఖుర్‌ఆన్ దైవప్రవక్త (సఅసం)పై అవతరించిందో అప్పుడే అది ఆయన (స) హృదయ ఫలకంపై ముద్రించుకుపోయింది. ఇక దాన్ని ఆయన మరిచిపోవడమనే సమస్యే తలెత్తేదికాదు. ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమైన రమజాన్ మాసంలో జిబ్రీల్ (అ) దైవప్రవక్త (సఅసం) వద్దకు వచ్చినప్పుడు అప్పటిదాకా అవతరించిన ఖుర్‌ఆన్ భాగాలను ఆయన (స) జిబ్రీల్ (అలై)కు వినిపించేవారు.

ఏ విధంగానైతే ఒకసారి గాలి వీచిన తర్వాత అది ప్రతి వస్తువునూ తాకుతూ, ప్రతి చోటికీ ఎలా చేరుతుందో అలాగే రమజాన్ రోజుల్లో దైవప్రవక్త (సఅసం) దాతృత్వ పరిధి కూడా అసాధారణంగా విస్తరిస్తూ ఇతర దినాలను మించిపొయ్యేది. అదీగాక జిబ్రీల్ (అలై) రమజాన్ మాసంలో ప్రతి రాత్రి వచ్చి దైవప్రవక్త (సఅసం)ను కలుసుకోవడం కూడా ఆయన సంతోషానికి అవధుల్లే కుండా చేసేది.

## జిబ్రీల్ (అలై) ప్రతి ఏడూ రమజాన్ మాసంలో దైవప్రవక్త (స)కు ఖుర్‌ఆన్ వినిపించేవారు

"హజ్రత్ అబూహురైరా(రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్త (స)కు ప్రతి సంవత్సరం ఒకసారి ఖుర్‌ఆన్ వినిపించబడేది. దైవప్రవక్త (సఅసం) ఇహలోకం వీడే సంవత్సరం మాత్రం రెండుసార్లు ఖుర్‌ఆన్ వినిపించబడింది.



దైవప్రవక్త (స) ప్రతి సంవత్సరం పదిరోజులు ఏతెకాఫ్ పాటించేవారు. కాని ఆయన పరమపదించే సంవత్సరం 20 రోజులు ఏతేకాఫ్ పాటించారు." *(బుఖారి)*

ఇంతకు ముందు హదీసులో దైవప్రవక్త (స) జిబ్రీల్ (అలై)కు ఖుర్‌ఆన్ వినిపించేవారని వచ్చింది. ఈ హదీసులో జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స)కు ఖుర్‌ఆన్ వినిపించేవారని వచ్చింది. అంటే ఒకసారి దైవప్రవక్త (స)కు జిబ్రీల్ (అలై) ఖుర్‌ఆన్ వినిపిస్తే, మరోసారి జిబ్రీల్ (అలై) దైవప్రవక్త (స)కు ఖుర్‌ఆన్ వినిపించేవారని, ఈ విధంగా ఈ విధానం రెండు వైపులనుండి సాగేదని మనకు అర్థమవుతోంది. అయితే దైవప్రవక్త (సఅసం) పరమపదించిన సంవత్సరం ఆయనకు రెండుసార్లు ఖుర్‌ఆన్ వినిపించడం జరిగింది. అంటే రెండుసార్లు దైవప్రవక్త (సఅసం) జిబ్రీల్ (అలై)కు ఖుర్‌ఆన్ వినిపించారు, జిబ్రీల్ (అలై) కూడా దైవప్రవక్త (సఅసం)కు రెండుసార్లు ఖుర్‌ఆన్ వినిపించారు. సాధారణంగా దైవప్రవక్త (సఅసం) ప్రతి సంవత్సరం 10 రోజుల ఏతెకాఫ్ పాటించేవారు. అయితే ఇహలోకం వీడే సంవత్సరం మాత్రం ఆయన 20 రోజులు ఏతెకాఫ్ పాటించారు.

## అత్యవసరం అయితే తప్ప దైవప్రవక్త (స) ఇంట్లోకి వెళ్ళేవారు కాదు

హజ్రత్ ఆయిషా (ర.అన్‌హా) ఇలా సెలవిస్తున్నారు: "దైవప్రవక్త (స) ఏతెకాఫ్ పాటిస్తున్నప్పుడు మస్జిద్‌లో కూర్చొనే తన శిరస్సును నా వైపుకు వంచేవారు. నేను ఆయన తల దువ్వేదాన్ని. దైవప్రవక్త (సఅసం) ఏతెకాఫ్ స్థితిలో ఉన్నప్పుడు సహజ అత్యవసరం ఏర్పడితే తప్ప ఇంట్లోకి వచ్చేవారు కాదు." *(ముత్తఫకున్ అలైహ్)*

హదీసులో 'హాజతుల్ ఇన్సాన్' అనేపదం వాడబడింది. అంటే, మసీదు నుండి బయటికి వెళ్ళడం తప్ప మరో మార్గంలేని మానవ సహజ అవసరం అన్నమాట. ఉదాహరణకు మలమూత్ర విసర్జన కోసం.

మరో విషయం– ఏతెకాఫ్ స్థితిలో దైవప్రవక్త (స) తన తలను హజ్రత్ ఆయిషా (రజి) వైపుకు వంచేవారు. ఆమె ఆయన తల దువ్వేవారు. ముందే చెప్పినట్లు ప్రవక్త సతీమణుల ప్రతి గృహద్వారమూ మసీదుకు అనుసంధానమై ఉండేది. తలుపు తీస్తే మసీదులోకి, ఇంట్లోకి ప్రవేశించవచ్చన్న మాట. ఈ కారణంగానే దైవప్రవక్త (సఅసం) తలను అటు వంచడం, ఆయన శ్రీమతి తలను దువ్వడం వగైరాలు సాధ్యపడేవి.

దీనివల్ల మనకు అర్థమయ్యేదేమిటంటే, మసీదు నుండి తల బయటకు పెట్టినంత మాత్రాన మనిషి బయటికి వెళ్ళినట్లు కాదు. ఒకవేళ కాలు బయట పెడితే మాత్రం బయటికి వెళ్ళినట్లే. ఎందుకంటే తల బయటపెడితే శరీరంలోని మిగతా భాగమంతా లోపలే ఉంటుంది కాబట్టి బయటికి వెళ్ళినట్లుకాదు. దీనివల్ల స్పష్టమైందేమిటంటే, తల బయటపెట్టినంత మాత్రాన 'ఏతెకాఫ్' భంగం కాదు. మసీదు నుండి కాలు బయటపెడితే మాత్రం ఏతెకాఫ్ భంగమవుతుంది.

అయితే, మసీదుకు భోజనం తెచ్చిచ్చేవారు ఎవరూ లేని పక్షంలో, కేవలం భోజనం తెచ్చుకోడానికి మాత్రం అనుమతి ఉంది.

భోజనం కోసం అతడు ఇంటికెళ్ళినా, హోటలుకెళ్ళినా పరవాలేదు. కాని వెంటనే భోజనం తెచ్చేసుకోవాలి. అలాగే మల, మూత్ర విసర్జన కోసం కూడా బయటికి పోవచ్చు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఏతెకాఫ్ చేసేవారికి బయటికి వెళ్ళే అనుమతి లేదు.

## దైవప్రవక్త (స) ఫజ్ర్ నమాజు చేసి ఏతెకాఫ్ కూర్చున్న చోటుకు వెళ్ళేవారు

హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: 'దైవప్రవక్త (స) రమజాన్ మాసంలోని



చివరి పదిరోజులు సదా ఏతెకాఫ్ పాటించేవారు. కాని ఒక సంవత్సరం ఆయన (స) ఏతెకాఫ్ పాటించలేదు. రెండో ఏడాది ప్రవక్త (స) 20 రోజులు ఏతెకాఫ్ పాటించారు.' *(తిర్మిజి, అబూదావూద్, ఇబ్నెమాజ)*

దైవప్రవక్త (సఅసం) తన మదీనా జీవితంలో ఒక ఏడాది ఏతెకాఫ్ పాటించలేదు. అంటే 'ఏతెకాఫ్' ఫర్జ్ కాని, వాజిబ్ కాని కాదని దీనిద్వారా మనకు తెలుస్తోంది. ఒకవేళ ఫర్జ్ కాని, వాజిబ్ కాని అయినట్లయితే దైవప్రవక్త (స) ఒక్క సంవత్సరం కూడా ఏతెకాఫ్‌ను విడిచిపెట్టేవారు కాదు. ఏతెకాఫ్ సాంప్రదాయకంగా ఆచరించబడే సత్కార్యమే అయినప్పటికీ ప్రజలకు ఫర్జ్, వాజిబ్, సున్నత్‌ల మధ్య వ్యత్యాసాన్ని తెలుపడానికి దైవప్రవక్త (సఅసం) ఒక సంవత్సరం ఏతెకాఫ్‌ను వదిలేశారు. దైవప్రవక్త (సఅసం) ఈ ఆచరణా విధానానికి ధర్మవేత్తలు భిన్న భాష్యాలు చెప్పారు. కొందరు దీన్ని వాజిబ్ అంటూ దైవప్రవక్త (సఅసం) జీవితాంతం ఏతెకాఫ్ పాటించారని, ఒక సంవత్సరం వదిలేస్తే రెండో సంవత్సరం దాని ఖజా పాటించారని అంటారు. మరికొందరు ఇది సున్నత్ అని, సున్నతె ముఅక్కిద అని, ముస్తహబ్ అని అంటారు. దైవప్రవక్త (సఅసం) భిన్న ఆచరణలను బట్టి ధర్మవేత్తలు ఒక అభిప్రాయానికి వచ్చారు. ఎవరెవరి అభిప్రాయాలను బట్టి వారివారి వాదనలు సరైనవనే ఒప్పుకోవలసి ఉంటుంది.

## దైవప్రవక్త (స) రమజాన్ చివరి దశకంలో సదా ఏతెకాఫ్ పాటించేవారు

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా సెలవిస్తున్నారు: "దైవప్రవక్త (స) ఏతెకాఫ్ సంకల్పం చేసుకున్నప్పుడు ఫజ్ర్ నమాజు ముగించుకొని తన ఏతెకాఫ్ బసకు వెళ్ళేవారు." *(అబూదావూద్, ఇబ్నెమాజ)*

హదీసులో 'ముఅతకఫ్' అనే పదం వాడబడింది. 'ముఅతకఫ్' అంటే మనిషి తాను ఏతెకాఫ్ కూర్చోడానికి ఎంచుకున్న ప్రదేశం (బస). ఆ ప్రదేశంలో

ఓ చోట ఒక పరదాకట్టుకొని ఏకాగ్రత కోసం ఏకాంతాన్ని ఏర్పరచుకోవడం. హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ప్రకారం దైవప్రవక్త (స) ఫజ్ర్ నమాజు చేసుకొని తన 'ముఅతకఫ్'లోకి వెళ్ళేవారు.

ఇమాం ఔజాహి, ఇమాం సూరి (రహ్మతుల్లా అలైహి) గార్లు కూడా ఏతెకాఫ్ ఫజ్ర్ నుండే ప్రారంభమవుతుందంటారు. అయితే ఏతెకాఫ్ ప్రారంభం మగ్‌రిబ్ నుండి అవుతుందని మరికొన్ని హదీసుల ద్వారా తెలుస్తోంది. అంటే ఒక మనిషి 21వ తేదీ నుండి ఏతెకాఫ్ పాటించాలనుకుంటే 20వ తేదీ మగ్రిబ్ నమాజ్ అనంతరం ఏతెకాఫ్‌లో కూర్చోవాలి. నలుగురు ఇమాములు కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉన్నారు. వీరు రెండవ హదీసు నుండి ఏతెకాఫ్ ప్రారంభమవుతుందనే ధర్మవేత్తలు పైహదీసును సాక్ష్యంగా చూపుతారు.

## ఏతెకాఫ్ స్థితిలో రోగిని పరామర్శించే సంప్రదాయం

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం: "దైవప్రవక్త (స) ఏతెకాఫ్ స్థితిలో రోగిని పరామర్శించేవారు. ఆయన నేరుగా రోగి వద్దకెళ్ళి ఆరోగ్య వివరాలడిగి నేరుగా తిరిగొచ్చేవారు." (అబూదావూద్)

మునుముందు రోగిని పరామర్శించే అనుమతి ఏతెకాఫ్ స్థితిలో లేదనే హదీసు రాబోతోంది. అదికూడా హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఉల్లేఖించిన హదీసే కావడం గమనార్హం. ఈ హదీసులో హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఏమంటారంటే, దైవప్రవక్త (సఅసం) రోగి 'పరామర్శకు వెళ్ళే వారుకాదు.' అంటే పరామర్శకు కూడా రెండు స్థితులు, సందర్భాలున్నాయని మనకు అర్థమవుతోంది. ఉదాహరణకు ఒక మనిషి సాధారణ అనారోగ్యానికి గురయ్యాడనుకోండి. అంటే పెద్ద ప్రమాదమేమీ లేదు. ఏదో సాధారణ సుస్తి. అలాంటప్పుడు దైవప్రవక్త (స) పరామర్శకు వెళ్ళేవారుకాదు. కాని ఒక మనిషి బాగా



జబ్బు పడి అతడి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందనుకోండి. అలాంటప్పుడు దైవప్రవక్త (సఅసం) తప్పకుండా అతని పరామర్శకు వెళ్ళేవారు. అయితే వెళ్ళిన ఉద్దేశాన్ని నెరవేర్చుకొని వచ్చేయాలి. మార్గమధ్యలో ఇతర పనుల కోసం ఆగకూడదు. దీనివల్ల మనకు అర్థమైంది ఏమిటంటే, రెండు హదీసులూ ప్రామాణికమే. బాహ్యపరంగా ఏదైతే వ్యత్యాసం మనకు కనబడిందో అది ఊకలా ఎగిరిపోయింది.

## ఏతెకాఫ్ స్థితిలో చేయకూడని పనులు, రెండు షరతులు

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఇలా సెలవిస్తున్నారు: "ఏతెకాఫ్ పాటించే వారు రోగి పరామర్శకు వెళ్ళకూడదు. జనాజా వెంట వెళ్ళకూడదు. స్త్రీని ముట్టకూడదు, మసీదు నుండి బయటికి వెళ్ళకూడదు. మసీదు నుండి బయటికి వెళ్ళడం తప్ప రెండో మార్గంలేని పరిస్థితిలో వెళ్ళవచ్చు. రోజా లేకుండా ఏతెకాఫ్ లేదు. జామె మస్జిద్ కాకుండా వేరే చోట ఏతెకాఫ్ లేదు."

*(అబూదావూద్)*

హజ్రత్ ఆయిషా (ర.అన్హా) ఏతెకాఫ్‌కు సంబంధించి ఈ హదీసులో సెలవిచ్చిన ఉపదేశాల్లో మొట్టమొదటిది, 'ఏతెకాఫ్ పాటించేవారు రోగిని పరామర్శించకూడదు' అనేది. దీనికి ముందు ప్రస్తావించిన హదీసును, ఈ హదీసును రెంటినీ పరిశీలిస్తే మనకు అర్థమయ్యేదేమిటంటే సాధారణ పరిస్థితిలో రోగిని పరామర్శించకూడదు. కాని రోగి పరిస్థితి ఆందోళనకరంగా ఉంటే మాత్రం పరామర్శించవచ్చు. 'ముఅతకిఫ్' జనాజా వెంట వెళ్ళకూడదనేది హజ్రత్ ఆయిషా (ర) గారి రెండవ ఆదేశం. భార్య సమీపానిక్కూడా వెళ్ళవద్దన్నది మూడవ ఆదేశం. ఇంతకు ముందు హజ్రత్ ఆయిషా (ర.అన్హా) గారి ఒక హదీసులో 'ఏతెకాఫ్ స్థితిలో నేను దైవప్రవక్త తల దువ్వేదాన్ని అని వచ్చింది. అంటే దైవప్రవక్త (స) తన సతీమణికి తనను తాకే అనుమతినిచ్చారు కాని ఆయన ఆమెను తాకలేదు. అయితే ఇతరుల విషయంలో ఇలాంటి

ప్రస్తావనకు అసలు అవకాశమే ఉండదు. ఎందుకంటే ఎవరి ఇళ్ళూ ఇలా మసీదులతో అనుసంధానమై ఉండవు దైవప్రవక్త (సఅసం) గృహాలున్నట్లు. అందుకని ఈ విషయంలో మరో మాటకు తావులేదు.

ఈ హదీసుల ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే, రోజా లేకుండా ఏతెకాఫ్ లేదు. అంటే నేను రోజా అయితే ఉండనుగాని ఏతెకాఫ్ మాత్రం పాటిస్తానంటే కుదరదు.

చివరి ఆదేశం హ॥జత్ ఆయిషా (ర.అన్హా) ఇలా సెలవిచ్చారు: 'జామె మస్జిద్‌లో తప్ప ఏతెకాఫ్ లేదు.' ఈ విషయంలో 'ఫుఖహా' ధర్మవేత్తల మధ్య కాస్తంత అభిప్రాయభేదముంది. కొంతమంది ధర్మవేత్తలు ఎక్కడైతే జుమా నమాజు అవుతుందో అక్కడ ఏతెకాఫ్ పాటించవచ్చు అంటారు. దీనికి భిన్నంగా మరి కొందరు ధర్మవేత్తలు ప్రతి మసీదులో కూడా ఏతెకాఫ్ పాటించ వచ్చు అంటారు.

మొత్తంమీద, జామె మస్జిద్ అంటే ఏ మసీదులో అయితే జమాత్ అవుతుందో అది జామె మసీదు అని అర్థం చేసుకోవాలి. అంటే ఏతెకాఫ్ కూర్చొనేవారు సామూహికంగా నమాజులు ఆచరించబడే మసీదునే ఎన్నుకోవాలి. అలా కాకుండా ఏదైనా మసీదేనని ఎప్పుడూ తాళం వేసి ఉండే మసీదులో ఏతెకాఫ్ కూర్చుంటే, అతడికి ఏతెకాఫ్ పూనిన పుణ్యం లభించి నప్పటికీ, జమాత్ కాని కారణంగా జమాత్‌తో నమాజు చేసే భాగ్యానికి అతడు నోచుకోలేడు. దీనివల్ల కూడా మనకు అర్థమయ్యేదేమిటంటే, ఎక్కడైతే సామూహిక నమాజ్ జరుగుతుందో, నమాజీలతో ఏ మసీదు అయితే కళకళ లాడుతుంటుందో దాన్ని జామెమసీదు అనుకుంటే ఎలాంటి అభిప్రాయభేదానికీ తావుండదు.

## దైవప్రవక్త (స) విశ్వాస స్థితిగతులు

హ॥జత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: 'దైవ ప్రవక్త (స) 'ఏతెకాఫ్'



సంకల్పం చేసుకున్నప్పుడు, ఆయన (స) పడక, లేక మంచాన్ని (మస్జిదె నబవిలో) క్షమాపణా స్తంభం వద్ద వేయడం జరిగేది." (ఇబ్నెమాజ)

హదీసులో మన్నింపు స్తంభం ప్రస్తావన వచ్చింది. ఇది ఈనాటికీ మస్జిదె నబవిలో ఉంది. దీనిపై 'ఉస్తువానతుత్తౌబ' అని రాయబడి ఉంది.

దీని కథాకమామీషు ఏమిటంటే– 'అబూలుబాబ (రజి) అనే ప్రవక్త సహచరుని వల్ల ఒక తప్పు దొర్లిపోయింది. ఒకసారి దైవప్రవక్త (స) హ॥జత్ అబూలుబాబ (రజి)ను బనూఖురైజా యూదుల వద్దకు రాయబారిగా పంపారు. అప్పుడాయన సంజ్ఞల ద్వారా మెడపై చేయి తిప్పుతూ 'ఇప్పుడిక మిమ్మల్ని వధించే నిర్ణయం తీసుకోబడుతుందని' తెలిపారు. దీనివల్ల ఒక సైనిక రహస్యం, యుద్ధరహస్యం శత్రువుకు చేరవేసినట్లయింది. దీనికి ఆయన మందలించ బడ్డారు. తరువాత తప్పు తెలుసుకున్న హ॥జత్ అబూ లుబాబ (రజి) తనను తాను మస్జిదె నబవీలోని ఓ స్తంభానికి బంధించుకున్నారు. తన తప్పు మన్నించ బడనంత వరకూ తన కట్లు విప్పుకోనని, అన్న పానీయాలు ముట్టనని ప్రకటించారు. చివరికాయన అదే స్థితిలో స్పృహతప్పి పడిపోయారు. తరువాత దైవం తరఫున మన్నింపు ప్రకటన వెలువడిన తర్వాత ఆయన్ని బంధించిన కట్లు విప్పడం జరిగింది. ఆ స్థంభం ఈనాటికీ మస్జిదె నబవీలో సురక్షితంగా ఉంది. దాని దగ్గరే దైవప్రవక్త (స) ఏతెకాఫ్ కూర్చొనేవారు.

## ఏతెకాఫ్ పాటించేవారి జాబితాలో రాయబడే సత్కార్యాలు

హ॥జత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం 'ముఅతకిఫ్' (ఏతెకాఫ్ పాటించేవాని) విషయంలో దైవప్రవక్త (సఅసం) ఇలా సెలవిచ్చారు: "ఏతెకాఫ్ పాటించేవారు (ఏతెకాఫ్ రోజుల్లో) పాపాల నుండి సురక్షితంగా ఉంటారు. అందుకని సకల సత్కార్యాలను ఆచరించే పుణ్యఫలాలన్నీ అతని (ఏతెకాఫ్ పాటించేవాడి) పత్రంలో రాయబడతాయి." (ఇబ్నెమాజా)

ఏతెకాఫ్ పాటించేవారు ఏతెకాఫ్ కారణంగా పాపాలనుండి సురక్షితంగా ఉంటారు. కాని దైవానుగ్రహం చూడండి! ఏతెకాఫ్ ప్రతిఫలంతో పాటు, ఆ కాలంలో అతడు మసీదు బయట ఉంటే అతడు చేసే సత్కార్యాలన్నిటి పుణ్యఫలం కూడా అతని కర్మపత్రంలో వ్రాయబడుతుంది. ఇక్కడ చూడండి! అతడు మసీదు బయట ఉంటే చేసే సత్కార్యాలను మాత్రమే ప్రస్తావించడం జరిగింది. మరప్పుడు చెడుకూడా చేయవచ్చుగా! కాని ఆ ప్రస్తావన రాలేదు. ఇది దైవం తన దాసుల పట్ల చూపే ప్రేమకు, కరుణకు ప్రబల నిదర్శనం.

పాపాల విషయంలో, మనిషి స్పష్టంగా పాపంచేసిన తర్వాత మాత్రమే దాన్ని రాయడం జరుగుతుంది. అదికూడా ఎంతచేస్తే అంతే. కాని సత్కార్యం విషయం అలాకాదు. సత్కార్య సంకల్పం చేసుకున్నా పుణ్యం రాయబడుతుంది. కనీసం చేసే అవకాశాలున్నా సత్కార్యం రాయడం జరుగుతుంది. ఒక మనిషి ఏదైనా సత్కార్యం చేయాలని తలపోస్తాడు, కాని అనివార్య కారణాల వల్ల అతడా సత్కార్యం చేయలేకపోతాడు. అయినా అతడి కర్మపత్రంలో ఆ సత్కార్యం పుణ్యం రాయబడుతుంది. అలాగే ఒక మనిషి ఒక దుష్కార్యం చెయ్యాలని సంకల్పించుకుంటే అతడా దుష్కార్యం చేయనంత వరకూ అది రాయబడదు. దైవం తన ప్రత్యేక ప్రియదాసులతో ఇలా వ్యవహరిస్తాడు. ఎందుకంటే ఆయన మహా అనుగ్రహశాలి. తానుకోరిన వారికి కోరినంత ఇస్తాడు. కొంతమంది, సత్కార్యాలు చేయకపోయినా పుణ్యఫలం ఇవ్వడమేమిటని అభ్యంతరం లేవదీస్తారు. అయితే, చక్రవర్తి సంతోషంగా ఇస్తున్నప్పుడు ఎవరికైనా అభ్యంతరం చెప్పాల్సిన అవసరం ఏముంది?

## రమజాన్ చివరి రాత్రిన ముస్లిం సమాజ మన్నింపు జరుగుతుంది

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "రమజాన్ చివరి రాత్రిన నా సమాజాన్ని మన్నించివేయడం జరుగుతుంది. అప్పుడు అనుచరులు 'దైవప్రవక్తా! అది లైలతుల్ ఖద్ర్ రాత్రా?' అని ప్రశ్నించారు. దానికి దైవప్రవక్త (స) 'కాదు, శ్రామికుడు తన పని ముగించిన తరువాత అతడికిచ్చే వేతనం అది' అని సెలవిచ్చారు. (అహ్మద్)



రమజాన్ చివరి రేయిన నా సమాజ మన్నింపు జరుగుతుందని దైవ ప్రవక్త నోట విన్న సహచరులు బహుశా అది 'లైలతుల్ ఖద్ర్' కావచ్చని భావించారు. లైలతుల్ ఖద్ర్ ఘనత, ప్రత్యేకత కారణంగా సమాజ మన్నింపు జరుగుతుందని తలపోశారు. కాని దైవప్రవక్త 'లైలతుల్ ఖద్ర్ కావడం వల్ల అలా జరగదు, ఒక శ్రామికునికి తాను తన పని పూర్తిగా నెరవేర్చిన తరువాత అతని వేతనం (ప్రతిఫలం) ఇవ్వబడుతుంది. అలాగే నా అనుచర సమాజం వేతనం వారు మన్నించబడడమే' అన్నారు. 'ఉమ్మత్' (అనుచర సముదాయం)ను క్షమించడం జరుగుతుందంటే రోజాలూ పాటించకుండా ఇతర దైవాదేశాలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారం వ్యవహరించేవారు మన్నించబడతారని అర్థం కాదు. రమజాన్ ఉపవాసాలు ఉంటూ, జీవితంలోని ఇతర రంగాల్లోనూ దైవాదేశాలు పాటించేవారిని మాత్రమే మన్నించడం జరుగుతుంది. ఆ కాలంలో దైవప్రవక్త అనుచర సంఘంలో ఉండి రోజా పాటించకపోవడమనేది కనీసం ఊహ క్కూడా అందని విషయం. ఆ కాలంలో మొత్తం అనుచర సమాజమంతా ఉపవాసవ్రతం పాటించేది. రమజాన్ మాసం ఆసాంతం దైవారాధనలో గడిచిపొయ్యేది. అన్ని రకాల చెడుల నుండి ఆనాటి సమాజం సురక్షితంగా ఉండడానికి ప్రయత్నించేది. ఇతర దినాలకంటే అధికంగా రమజాన్‌లో సత్కార్యాలు చేసేది. అందుకనే ఇక్కడ ఆ అనుచర సమాజాన్ని ప్రస్తావించడం జరిగింది. రమజాన్ వచ్చినప్పటికీ ఏమరుపాటు వహిస్తూ తలబిరుసుతనం మానుకోనివారు, రోజా పాటించడం మాట అటుంచి బహిరంగంగా తింటూ త్రాగుతూ తిరిగేవారు– ఇలాంటి వారి విషయంలో రమజాన్ చివరి రాత్రిలో మన్నింపుజరుగుతుందనే ప్రశ్నే తలెత్తదు. దీనికి భిన్నంగా ఆ రాత్రి వారికి వ్యతిరేకంగా నేరారోపణ (Prosecution Case) రుజువైపోతుంది.

# దేవుడు విధేయులైన తన దాసుల పట్ల గర్విస్తాడు

హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ఉపదేశించారు: "లైలతుల్ ఖద్ర్ రాగానే జిబ్రీల్ (అలైహి) దైవదూతల బృందంతో దివి నుండి భువికి దిగివస్తారు. అప్పుడు ఏ దాసుడైనా నిలబడిగాని, కూర్చోనికాని దైవాన్ని స్మరిస్తూ ఉన్నట్లయితే (ఆ రాత్రి మేల్కొని దైవారాధనలో లీనమైఉంటే) వారికోసం ఆయన ప్రార్థన (దుఆ) చేస్తారు."

ఆ తరువాత పండుగ రోజు రాగానే దేవుడు దైవదూతల సమక్షంలో తన దాసుల పట్ల గర్విస్తూ- 'నా దూతలారా! తన కప్పగించిన పని పూర్తి చేసినవాడి శ్రమకు ప్రతిఫలం ఏమిటి?' అని ప్రశ్నిస్తాడు. దానికి వారు 'ఓ మా ప్రభూ! అతడి శ్రమకు తగిన పూర్తి ప్రతిఫలం అతనికి ఇచ్చివేయాలి' అంటారు. అప్పుడు అల్లాహుతఆలా 'నా దూతలారా! నా దాసులు, నా దాసీలు నేను వారిపై విధించిన బాధ్యతను పూర్తిగా నెరవేర్చి, దీనంగా నన్ను వేడుకోడానికి (ఈద్ నమాజు కోసం) తమ ఇళ్ళ నుండి బయలుదేరారు. దూతలారా! వినండి నా మహిమ సాక్షిగా, నా గౌరవోన్నతుల సాక్షిగా, నా కార్యం సాక్షిగా, నేను వారి మొరలన్నింటినీ ఆలకించాను. వారి ప్రార్థనలు స్వీకరించాను' అని అంటాడు. తరువాత తన దాసులనుద్దేశించి 'పోండి, నేను మిమ్మల్ని క్షమించాను. మీ దుష్కార్యాలను సత్కార్యాలుగా మార్చివేశాను' అంటాడు. (బైహఖీ)

అల్లాహ్ ప్రతి సంవత్సరం విశ్వాసులైన తన దాసులపట్ల ఇలాగే వ్యవహరిస్తాడు. ఎందుకంటే వారు రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటించారు. లైలతుల్ ఖద్ర్ అన్వేషణలో రాత్రులు దైవారాధనలో గడిపారు. ఈద్ నమాజు కోసం ఈద్‌గాహ్‌కు వెళ్ళారు. వినమ్రులై దీనాతిదీనంగా దైవం ముందు మోకరిల్లి ప్రార్థనలు చేశారు. వీటన్నిటి ఫలితంగా వారు దైవం వద్ద నుండి మన్నింపు, అనుగ్రహాల నిధిని తీసుకొని ఇంటికి మరలారు.



# ఫిత్రా దానం

**ఫిత్రాదానం ఆదేశం :** 'ఉపవాసి సత్కార్యాల ప్రతిరూపం అతడి బాహ్య శరీరంలో పవిత్రాత్మ నిత్యం జాగృతమై ఉంటుంది. ఉపవాసం ఉన్నవారు అసత్యాలు, చాడీలు, అసభ్యకరమైన పలుకులు, ప్రజల మనసు నొప్పించడం, వారి హక్కుల్ని హరించడం లాంటి ఏ విధమైన చెడ్డ పనులకు పాల్పడరు. అన్ని రకాల చెడుల నుండి సురక్షితంగా ఉంటారు. కనీసం అలా ఉండడానికైనా ప్రయత్నిస్తారు. ఎంత ప్రయత్నించినా వారు మానవులేకాని, దైవదూతలైతే కాలేరు. అందుకని, ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వారివల్ల ఏదో ఒక పొరపాటు జరుగుతూనే ఉంటుంది. నోటి నుండి ఏదో ఒక పలక కూడని మాట జారుతూనే ఉంటుంది. అందుకని దైవికంగా ఉపవాసం ఏవిధమైన మచ్చ లేకుండా పరిపూర్ణంగా ఉండడమనేది అసంభవం. కారుణ్యమూర్తి ముహమ్మద్ ప్రవక్త (స) ఉపవాసాలను ఇలాంటి లోపాలకు అతీతంగా, పరిత్రంగా పూర్తి చేయడానికి ఒక ప్రత్యేకమైన దానం చేయవలసిందిగా హితవు గరిపారు. దీన్ని షరీఅత్ పరిభాషలో 'సద్ఖా ఫిత్ర్' అంటారు. హదీసుల్లో ఇలా ఉంది: "ఫిత్రా దానం చెల్లించనంతవరకూ రమజాన్ రోజాలు భూమ్యాకాశాల మధ్య వేలాడుతూ ఉంటాయి. దైవ సన్నిధికి చేరవు." (తర్‌గీబ్)

"దైవ ప్రవక్త (స) ఫిత్రా దానాన్ని విధిగా నిర్ణయించారు. ఎందుకంటే, ఉపవాసం పాటించేవారి ఉపవాసం అసభ్యం, అశ్లీలాల మచ్చలు మరకల నుండి పరిశుద్ధం, పవిత్రం కావడానికి." (అబూదావూద్, ఇబ్నెమాజ)

పై హదీసుల్లో ఫిత్రాదానం ప్రాముఖ్యం, దాని లక్ష్యం రెండూ వివరించబడ్డాయి. ఫిత్రా లక్ష్యం ఉపవాసాన్ని అన్ని విధాల లోపాల నుండి పవిత్రం, పరిశుద్ధం చేయడం. ఇంతకు ముందే ఈ విషయాన్ని వివరించడం జరిగింది. పోతే దాని ప్రాముఖ్యం ఏమిటంటే దీన్ని చెల్లించడం తప్పనిసరి. హదీసు పరిభాషలో ఫిత్రా చెల్లించడం ఫర్జ్ (విధి). హనఫీ ధర్మవేత్తలు దీన్ని

వాజిబ్ అని చెప్పారు. అయినప్పటికీ ఫిత్రా చెల్లింపు తప్పనిసరనేది తిరుగులేని సత్యం. ఎందుకంటే ఫర్జ్, వాజిబ్‌ల మధ్య చాలా చిన్న వ్యత్యాసం మాత్రమే ఉంది. ఫిత్రాదానం ఉద్దేశ్యాన్ని గనక దృష్టిలో ఉంచుకుంటే ఉపవాసం పాటించే ముస్లిం దాని చెల్లింపు కోసం తహతహ లాడుతాడనడంలో సందేహంలేదు.

## ఫిత్రాదానం ప్రతి ఒక్కరూ చెల్లించాలి

ఫిత్రా దానం ఫర్జ్ (విధి) లేక వాజిబ్ కావడానికి, ఒక మనిషి జకాత్ చెల్లించే స్థాయి కలవాడై ఉండాలన్న షరతు లేదు. ధనవంతుడు ఫిత్రా చెల్లించడం ఎంత తప్పనిసరో పేదవాడు కూడా ఫిత్రా చెల్లించడం అంతే తప్పనిసరి. ఎవరి వద్దనైతే పండుగనాడు తన కుటుంబమంతటికీ సరిపడినంత ధనధాన్యాలు పోగా, మిగిలిన దానిలో కుటుంబంలోని ప్రతి ఒక్కరి తరఫున ఒక 'సా' ఎత్తు (ధాన్యం) చెల్లించగల స్తోమత ఉంటే అతను తన కుటుంబ సభ్యులందరి ఫిత్రా దానాలు చెల్లించడం తప్పనిసరి.

హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) గారి ఉల్లేఖనాన్ని బట్టి మనకీ క్రింది విషయం అర్థమవుతోంది:

"ఫిత్రా దానంగా ఒక 'సా' ఎత్తు ఖర్జూరం ('సా' అంటే పావు తక్కువ రెండు సేర్లు, లేక దాని ఖరీదు) లేక 'జౌ' (ధాన్యం) చెల్లించడం స్వతంత్రుడు, బానిస, స్త్రీ, పురుషులైన ప్రతి ముస్లింపై దైవప్రవక్త (స) ఫర్జ్‌గా నిర్ణయించారు."

*(తిర్మిజీ, రెండవ భాగం)*

ధనవంతులు, నిరుపేదలు అనే తారతమ్యం లేకుండా అందరూ తప్పనిసరిగా ఫిత్రా దానం చెల్లించాలనేది ప్రతి ముస్లిం అంతరంగం కోరిక. ఒక హదీసులో దీని వివరణ ఇలా ఉంది– "దైవం ధనవంతుణ్ణి అతడి సదఖా మూలంగా పరిశుద్ధపరుస్తాడు. పోతే, పేదవాడు ఎంత ఫిత్రాదానం చేస్తాడో అంతకంటే ఎక్కువ అతడికి దేవుడు తిరిగిచ్చేస్తాడు (ఇతరుల దానం అతనికి ఇప్పించడం ద్వారా)." *(అబూదావూద్)*



ఈ హదీసుల ద్వారా మనకు అర్థమైన మరో విషయం ఏమిటంటే, ఉపవాస వ్రతం పాటించే వారిపై మాత్రమే ఫిత్రా దానం ఫర్జ్ కాలేదు. ఉపవాసం పాటించకపోయినా స్తోమత కలిగిన ప్రతి ముస్లిం విధిగా ఫిత్రా చెల్లించవలసి ఉంటుంది. అనివార్య కారణాలవల్ల రోజా పాటించలేకపోయినా, ప్రాజ్ఞత రాని కారణంగా రోజా ఫర్జ్ కాక పాటించకపోయినా మొత్తం మీద ప్రతి ఒక్కరూ ఫిత్రా చెల్లించడం తప్పనిసరి.

అంతేకాకుండా దైవప్రవక్త (సఅసం) ఫిత్రాదానాన్ని 'తూమ తుల్లిల్ మసాకీన్' అన్నారు. అంటే దీనులు, నిరుపేదల భృతి అని అర్థం. ఏ విధంగానైతే ఫిత్రా లక్ష్యం ఉపవాసాన్ని పరిశుద్ధపరచడమో, అలాగే పండుగపూట దీనులు, నిరుపేదల పండగ సామగ్రి సమకూర్చడం కూడా ఈ ఉద్దేశంలో ఇమిడి ఉన్న వివేకం. అందుకని కేవలం ఉపవాసుల వరకే పరిమితం కాకుండా ఈ పరిధి ముస్లింలందరి వరకూ విస్తరించాలి.

## ఈదుల్‌ఫిత్ర్ (పండుగ) ప్రత్యేకత

రమజాన్ నెల పూర్తి రోజాలను నెరవేర్చడమంటే, దైవాదేశపాలనలో ఒక గురుతరమైన బాధ్యతను నెరవేర్చడమన్నమాట. ఇలాంటి సందర్భంలో ఒక మనిషిగా అతని హృదయం సంతోషంతో పొంగి పోవడం, ఒక విశ్వాసిగా దైవం పట్ల కృతజ్ఞతా భావంతో నిండి పోవడం సహజం. ఈ సహజ భావోద్రేకాలే 'ఈదుల్ ఫిత్ర్' రూపంలో బహిర్గతమవుతాయి. ఈ పండుగలో విశ్వాసి తాను రోజా విధి నెరవేర్చిన సందర్భంగా తన హృదయంలోని సంతోషాన్ని బహిరంగంగా వ్యక్తపరుస్తాడు. మరోవైపు దైవాదేశ పాలనలో ఒక విధిని నెరవేర్చే భాగ్యాన్ని ప్రసాదించినందుకు దైవానికి కృతజ్ఞతాస్తోత్రాలు చెల్లిస్తాడు. ఇక్కడ ఇస్లాంలో పాటించబడే పండుగలకు, ఇతర జాతుల్లో పాటించబడే పండుగలకు గల మౌలిక వ్యత్యాసం కూడా మనకు అర్థమవుతుంది. ఇస్లాంలో పండుగ సంబరాలు ప్రాపంచిక లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు

గాక, ఒక ఆరాధనా విధి నెరవేర్చి పరలోక మోక్షానికి అర్హత సంపాదించామనే సంతోషంతో ముస్లింలు ఈ సంబరాలు జరుపుకుంటారు.

## పండుగ రోజు రాత్రి ఆరాధన

ఈదుల్ ఫిత్ర్, బక్రీద్ రాత్రులు ఔన్నత్యం, శుభాలు కల రాత్రులు. ఈ రాత్రుల్లో కూడా మేల్కొని ఆరాధనలు చేయాలి. దైవప్రవక్త (స) ఇలా సెల విచ్చారు: 'ఎవరైతే పుణ్యఫలాపేక్షతో ఈ రెండు ఈద్, బక్రీద్ రాత్రులు దైవా రాధనలో గడుపుతారో వారి హృదయాలు ఇతరుల హృదయాలు నిర్జీవమై పోయినప్పుడు సజీవంగా ఉంటాయి." (ఇబ్నెమాజ)

అంటే ప్రళయం రోజున అనేకమంది మానవులు కష్టాలతో ఎంతో భయాందోళనలకు గురయి ఉంటే వీరు మాత్రం నిర్భయంగా, నిశ్చింతగా ఉంటారని అర్థం.

## ఈద్ (పండుగ) నాటి సాంప్రదాయాలు

**పండుగనాడు ఈ పనులు చేయడం సంప్రదాయం :**

1. **గుసుల్ చేయడం :** హజ్రత్ ఇబ్నెఉమర్ (రజి) విషయంలో ఇలా చెప్పబడింది, "ఆయన ఈద్‌గాహ్‌కు వెళ్ళేముందు గుసుల్ (స్నానం) చేసేవారు. (మువత్తా, ఇమాంమాలిక్) అలాగే, అబూరాఫె బిన్ అబ్బాస్ మొదలగువారి ప్రకారం 'దైవప్రవక్త (స) పండుగరోజు గుసుల్ (స్నానం) చేసేవారు."
2. **మంచి వస్త్రాలు ధరించడం :** హాకీం కథనం: "దైవప్రవక్త (స) పండుగల సందర్భాల్లో అవకాశాన్ని బట్టి చాలా మంచి వస్త్రాలు తొడగ మని ఉపదేశించేవారు. హజ్రత్ అబ్దుల్లా ఇబ్నెఉమర్ (రజి)గారి ఆచరణ ఈ విషయంలో ప్రవక్త సంప్రదాయానికి అద్దం పట్టేది. ఆయన(రజి) పండుగల సమయాల్లో ఎంతో శ్రేష్ఠమైన వస్త్రాలు ధరించే వారు." *(ఫతహుల్ బారి, బైహఖీ, ఇబ్నె అబుల్‌దానియా ఆధారంగా)*



3. **సుగంధ ద్రవ్యాలు వాడడం :** పై హదీసులోనే దీని ప్రస్తావన కూడా ఉంది. పండుగల సందర్భాల్లో మీకున్న దానిలోని అత్యుత్తమ సుగంధ ద్రవ్యాలు వాడాలి.
4. **ఈద్‌గాహ్‌కు వెళుతూ బిగ్గరగా తక్బీర్ పలకడం :** 'ఖుర్ఆన్ మాటల్లో..... 'వలితుకబ్బిరల్లాహ అలామాహదాకుమ్', అంటే 'అల్లాహ్ గొప్పదనాన్ని కీర్తించండి. ఆయన హితవులననుసరించి'. ఈ వాక్యం ఉద్దేశాన్ని ధార్మిక పండితులు పండుగనాడు బిగ్గరగా తక్బీర్ పఠించడం అని అన్నారు. ప్రవక్త అనుచరులు కూడా ఈ విధానాన్ని అవలంబించి నట్లు ఆధారాలున్నాయి. హజ్రత్ అలీ (రజి), హజ్రత్ ఇబ్నె ఉమర్ (రజి)లు ఈద్‌గాహ్‌కు వెళ్ళేటప్పుడు తక్బీర్ చెప్పేవారు. తక్బీర్ పదాలు ఇవి: **'అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ లాయిలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హమ్ద్.'** (దారెఖుత్నీ)
5. **కాలినడకన ఈద్‌గాహ్‌కు వెళ్ళడం :** 'మీరు ఈద్‌గాహ్‌కు కాలినడకన వెళ్ళండి' అని హజ్రత్ అలీ (రజి) చాలా స్పష్టంగా చెప్పారు. (తిర్మిజీ)
6. ఈద్‌గాహ్‌కు ఒక మార్గాన వెళ్ళి, మరో మార్గాన తిరిగి రావాలి. తిర్మిజి, అహ్మద్ బిన్ హబ్బాన్ గార్ల హదీసుల్లో ఇలా ఉంది: 'దైవప్రవక్త (సం) ఈద్‌గాహ్‌కు ఒక మార్గాన వెళ్ళి మరో మార్గాన తిరిగి వచ్చేవారు.' దీనికి చాలాకారణాలు చెప్పబడ్డాయి. ఇస్లాం, ముస్లింల శక్తి సామర్థ్యా లను ప్రదర్శించడం ప్రధానకారణం.
7. బేసి సంఖ్యలో ఉండేలా పచ్చి ఖర్జూరాలు లేక ఎండు ఖర్జూరాలు, అవీ లేకపోతే ఏదైనా తీపి పదార్థం తిని ఈద్‌గాహ్‌కు వెళ్ళాలి. హజ్రత్ అనస్ (రజి) ఇలా సెలవిస్తున్నారు: "దైవ ప్రవక్త (స) ఈదుల్ ఫిత్ర్ (పండుగ) ఉదయాన బేసి సంఖ్యలో ఉండేలా (అంటే 3 లేక 5 లేక7) ఖర్జూరాలు తినకుండా ఈద్‌గాహ్‌కు వెళ్ళేవారు కాదు.'

*(బుఖారి, కితాబుల్ ఈదైన్)*

**-: సమాప్తం :-**

## తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్ (రిజిష్టర్డ్) ప్రచురణలు

1. దివ్యఖుర్ఆన్
2. ఖుర్ఆన్ అవగాహనం (30వ భాగం)
3. దివ్యఖుర్ఆన్ (30వ భాగం)
4. హదీసు వెలుగు (స్టాకులో లేదు)
5. హదీసు వెలుగు (అరబీ మూలంతో)
6. ప్రవక్త ప్రవచనం (అరబీ మూలంతో)
7. ఇస్లామీయ జీవన సరళి
8. మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)
9. ఇస్లాం అపార్థాల మబ్బుల్లో
10. ఇదియే ఇస్లాం
11. నేను ఆరాధించే ఇస్లాం
12. వెన్నెల తెరలు
13. సందేహాలు–సమాధానాలు
14. జుమా ప్రసంగాలు
15. సంకెళ్ళు
16. ప్రభువు పిలుస్తున్నాడు
17. ఆధునిక ఆర్థిక సిద్ధాంతాలు
18. ధర్మపథంలో జీవనరథం
19. ఇస్లాం శిక్షణ
20. ఆరాధనలు
21. నమాజ్ పుస్తకం
22. ఇస్లామ్ ప్రవక్త ముహమ్మద్
23. ఇస్లామ్ మరియు అజ్ఞానం
24. సాక్ష్యం మానవాళి సమక్షంలో
25. ఇస్లాం రాజకీయ సిద్ధాంతం
26. హేతువు కాంతిలో దైవప్రవక్త
27. ప్రవక్త సందేశం
28. ఖుర్ఆన్ అవగాహనకు మూలసూత్రాలు
29. భవబంధాలు మోక్షానికి ప్రతిబంధకాలా?
30. అంటరానితనం
31. ఆదర్శమూర్తి
32. శ్రేయస్కరమార్గం
33. మరణానంతర జీవితం
34. ధర్మ సంస్థాపనం
35. నమాజ్
36. ఇస్లాం పరిచయం
37. ముఖ్య హితవులు
38. కారుణ్య వ్యవస్థ
39. దివ్యఖుర్ఆన్ ముహమ్మద్ రచనకాదు
40. పరదా ప్రగతికి ప్రతిబంధకమా?
41. యదార్థమేది?
42. దైవ నియమావళి
43. లోకశాంతి
44. మతము – రాజకీయం
45. నిర్మాణం – విచ్ఛిన్నం
46. ముస్లిం పర్సనల్ లా
47. ఈమాన్ వాస్తవికత (ఖుత్బాత్ 1వ భాగం)
48. ఇస్లాం వాస్తవికత (ఖుత్బాత్ 2వ భాగం)
49. ఆరాధనల వాస్తవికత (ఖుత్బాత్ 3వ భాగం)
50. జకాత్ వాస్తవికత (ఖుత్బాత్ 4వ భాగం)
51. హజ్ వాస్తవికత (ఖుత్బాత్ 5వ భాగం)
52. కలిమయే తయ్యిబా అర్థం
53. అల్ ఫాతిహా (తఫ్హీముల్ ఖుర్ఆన్)
54. ఇస్లామీ మతధర్మం
55. పెట్టుబడిదారీ–సామ్యవాదం–ఇస్లాం
56. ఇస్లాం దృష్టిలో మద్యనిషేధం
57. ధర్మపథం
58. సత్యధర్మం
59. ఖురానీ గాథలు
60. దైవప్రవక్తలు (1వ భాగం)
61. దైవప్రవక్తలు (2వ భాగం)
62. దైవప్రవక్తలు (3వ భాగం)
63. దైవప్రవక్తలు (4వ భాగం)
64. నీతి కథలు (1వ భాగం)
65. నీతి కథలు (2వ భాగం)
66. నీతి కథలు (3వ భాగం)
67. నీతి కథలు (4వ భాగం)
68. ఈ తల్లి ఒడిలో...
69. బుష్రా ఉత్తరాలు
70. ప్రియమైన అమ్మకు...
71. తీర్పులు
72. విరిసిన మొగ్గలు
73. మణిహారం (1వ భాగం)
74. మణిహారం (2వ భాగం)
75. మహనీయుల బాట (1వ భాగం)
76. మహనీయుల బాట (2వ భాగం)



77. నికాహ్ ప్రసంగం
78. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర(1వభాగం)
79. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర(2వభాగం)
80. జమాఅతె ఇస్లామీ హింద్ చరిత్ర(3వభాగం)
81. దివ్యగ్రంథంలో దైవప్రవక్త
82. దైవదాస్యమే మానవ ఔన్నత్యం
83. మానవ హక్కులు
84. జాతీయ సమైక్యత
85. ఇస్లాం ప్రబోధిని (మొదటి భాగం)
86. ఇస్లాం ప్రబోధిని (రెండవ భాగం)
87. ఇస్లాం ప్రబోధిని (మూడవ భాగం)
88. ఇస్లాం ప్రబోధిని (నాల్గవ భాగం)
89. బైబిల్‌లో ముహమ్మద్
90. మానవులు – సమస్యలు
91. దైవ మార్గంలో సతత సమరం–జిహాద్
92. ప్రియ ప్రవక్త (సఅసం)
93. మానవసేవ
94. టెర్రరిజం–ఇస్లామీయ బోధనలు
95. మాటల ముత్యాలు
96. హజ్రత్ సాలమ్ (రజి)
97. సామాజిక న్యాయం ఇస్లాంలోనే సాధ్యం
98. ఇస్లామీయ పరిభాషలో జిహాద్
99. రండి! ఈ ప్రపంచాన్ని మారుద్దాం!
100. భారతీయ సమాజంలో పరమత సహనం
101. నవయుగం నవతరం
102. భారత దేశంలో ఇస్లామీ సందేశం
103. ఇస్లాం ఉగ్రవాదానికి వ్యతిరేకం
104. సత్యాన్వేషణ
105. మానవుల్లో సోదరభావం
106. శాంతి ఎలా స్థాపితమవుతుంది?
107. పరలోక భావన భారతీయ సాంప్రదాయాలు
108. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి)
109. హజ్రత్ ఉమర్ ఫారూఖ్–యె–ఆజమ్(రజి)
110. హజ్రత్ ఉస్మాన్ గని (రజి)
111. హజ్రత్ అలీ (రజి)
112. ప్రవక్త (సఅసం) వారి ప్రాణమిత్రులు
113. అమెరికాలో నవ ముస్లిముల వాస్తవ గాథలు
114. ఇస్లాం అధ్యయనం ఎందుకు చేయాలి?
115. నిన్ను నీవు తెలుసుకో
116. స్వీయ సంస్కరణ
117. బాలశ్రామికులు
118. జమాఅతె ఇస్లామీ హింద్ ప్రాధాన్యతలు
119. దైవదౌత్యం ముగింపు
120. ధర్మపథంలో అవరోధాలు
121. హజ్రత్ ఆయెషా (రజి)
122. ఎడారిపువ్వు
123. మానవులంతా ఒక్కటే
124. మధురమైన మాటలు
125. తూరుపుతావి
126. ఖుర్ఆన్ 24 ఆయత్‌లు–అభ్యంతరాలు, వాస్తవికత
127. ఖుర్ఆన్ అవగాహనం (మొదటి సంపుటం)
128. హజ్ పరమార్థం
129. ఒక మనిషి రెండు వైఖరులు
130. క్యాంపస్ గైడ్ (ఎస్.ఐ.ఓ.)
131. ఖుర్ఆన్ దైవగ్రంథం
132. తెలుగు అధికార భాష కావాలంటే...
133. దానా హకీమ్
134. దాంపత్య నియమాలు
135. ప్రపంచ మతాలు–ఇస్లాం
136. భారత స్వాతంత్ర్యోదమం– ముస్లింలు
137. మైసూరు పులి–టిప్పుసుల్తాన్
138. షహీద్ యె ఆజం–అష్ఫాఖుల్లా ఖాన్
139. మానవ మహోపకారి ముహమ్మద్ (స)
140. మేరాజ్ యాత్ర – సందేశం
141. ఒడి నుండి సమాధి వరకు
142. రమజాన్ శుభాలకు అర్హులు
143. రమజాన్ సత్కార్యాల సమాహారం
144. హజ్రత్ ఇమామ్ హుసైన్
145 అంతరిక్ష అధ్యయనం–దివ్యఖుర్ఆన్
146. భారత స్వాతంత్ర్యోద్యమం–ముస్లిం మహిళలు
147. ఉమ్మడి కుటుంబం – ఇస్లామ్
148. బహుభార్యత్వం–ఎప్పుడు–ఎందుకు?
149. భ్రూణహత్యలు
150. వివాహ సంబంధాల ఎంపిక ఎలా చేయాలి?
151 వివాహసంబంధాలు–అసమానతా భావాలు ఇస్లామ్
152. వివాహాలు దుబారా ఖర్చులు
153. లింగవివక్ష
154. సంతానానికి శిక్షణ
155. తలాఖ్
156. దిక్సూచి